PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 149 | విజయవాడ, శుక్రవారం 30 డిసెంబర్ 2022 | 6+8 పేజీలు వెల : రూ. 5. 50

Vol No | Vijayawada, Friday 30 December 2022 | Rs

40 రోజులు అత్యంత కీలకం

- జనవరిలో కరోనా ఉధృతి : అధికారుల అంచనా
- 31 నుంచి 2 శాతం విమాన ప్రయాణికులకు ర్యాండమ్ టెస్ట్‌లు

● లోపలి పేజీలో.. ●

సిటీ ◆

రన్‌వేపై కొంచెం ఎత్తులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న కార్గో విమానం

ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు

సంక్షేమం ఉచితం కాదు ప్రజల హక్కు

విజయన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న తమ్మినేని, వెంకట్ తదితరులు

ఒకే దేశం, ఒకే విధానం రాష్ట్రాల హక్కులు హరించడమే

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సంక్షేమ పథకాలు ఏ మాత్రమూ ఉచితాలు కాదని, ప్రజల హక్కని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఉద్ఘాటించారు. ప్రయివేటీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్రం వల్లించే ఒకే దేశం, ఒకే విధానం రాష్ట్రాల హక్కులను హరించడమేనని తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 3వ రాష్ట్ర మహాసభ ప్రారంభం సందర్భంగా గురువారం ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల హక్కుల కోసం ఉద్యమించిన సుందరయ్య, బసవపున్నయ్యలు ఉద్యమించిన గడ్డపై మాట్లాడడం గర్వంగా ఉందని విజయన్ అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్మరించుకున్నారు. ముదిగొండ అమరులకు జోహార్లు అర్పించారు. వలసవాద వ్యతిరేక పోరాటాల స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వ పెద్దలు మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని పక్కనబెట్టి... మతవాదాన్ని నెత్తికెత్తుకుంటున్నారని దుయ్యబట్టారు. గాడ్సే, సావర్కర్లను కీర్తిస్తూ మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. జాతీయవాద నిర్వచనాన్ని హిందుత్వ శక్తులు మార్చేస్తున్నాయన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంతో ఎటువంటి సంబంధమూ లేదని తెలిపారు. బ్రిటీష్ వాళ్లకు క్షమాపణలు చెప్పి వారి అడుగులకు మడుగులొత్తిన సావర్కార్ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడొద్దని చెప్పారని అన్నారు. జిన్నా కంటే ముందే రెండు దేశాల సిద్ధాంతాన్ని సావర్కర్ ప్రతిపాదించాడని గుర్తు చేశారు. దేశంలో మెజార్టీగా ఉన్న దళిత, ఆదివాసీ, మహిళలు నిరంతరం దాడులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులం, మతం, జాతి, భాష వైషమ్యాలు సృష్టిస్తూ దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి శ్రామికుల ఐక్యతను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హిందీ భాషను బలవంతంగా దేశంపై రుద్దడం అందులో భాగమేనన్నారు. తాను హిందీ భాషకు వ్యతిరేకం కాదని, మాతృభాషలను నిర్వీర్యం చేసేలా హిందీని రుద్దడం మిగతా 5లో

పది నిమిషాలు ఆలస్యమైనా

జీతం కట్

- ప్రభుత్వ నిర్ణయం
- ఉదయం 10.10లోగా రావాల్సిందే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విధులకు ఆలస్యంగా వచ్చే ఉద్యోగుల జీతాల్లో కోత విధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం జారీచేసిన తాజా ఆదేశాల ప్రకారం నిర్దేశించిన సమయానికన్నా పది నిమిషాలు ఆలస్యంగా వచ్చినా జీతంలో కోత పడనుంది. దీంతో ఈ విషయం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తమ అసంతృప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడా నికి ఉద్యోగులు సిద్ధమవుతు న్నారు. తొలుత ఉన్నతాధికారులతో మాట్లాడతామని, అవసరమైతేనేరుగా ప్రభుత్వపెద్దలతోనూ చర్చిస్తామని వారు అంటున్నారు. ఫేషియల్ హాజరుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపైనే ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆ విధానం అమలులోకి వచ్చేలోగా హాజరు పుస్తకాన్ని ఎలా వినియోగించాలన్న దానిపై తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.హాజరు పుస్తకాన్ని సంబంధిత విభాగ ఉన్నతాధికారి వద్ద ఉదయం పది నుండి 10.10 గంటల వరకు ఉంచాలని, సిబ్బంది అందరు అక్కడే వచ్చి సంతకాలు చేయాలని పేర్కొంది. 10.10 తరువాత వచ్చేవారికి లేట్‌ముద్ర వేయాలని, ఆ ముద్ర పడిన వారికి జీతాల్లో కోత పెడతామని తెలిపింది. తొలుత ఈ విధానం సిఎఫ్ఎంఎస్ విభాగంలో అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, ఇది చాలా తీవ్రమైన చర్య అన్న అభిప్రాయం ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ట్రయల్ రన్ విజయవంతం

- జాతీయ రహదారిపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ వద్ద చక్కర్లు కొట్టిన ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. బాపట్ల జిల్లా కోరిశపాడు మండలం పిచ్చుకలగుడిపాడు-రేణంగివరం గ్రామాల వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై 4.1 కిలోమీటర్ల పొడవు, 33 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ ఎయిర్‌స్ట్రిప్‌ను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మించింది. నిర్మాణ పనులు ముగింపు దశకు చేరడంతో భారత వాయుసేన అధికారులు నాలుగు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఒక ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్‌తో గురువారం ట్రైల్ రన్ నిర్వహించారు. హైవేకి ఐదడుగుల ఎత్తులో ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్‌లు చక్కర్లు కొట్టడం, సురక్షితంగా గమ్యస్థానానికి చేరడంతో వాయిసేన అధికారులు ప్రక్రియను ముగించారు. ఈ దృశ్యాలను తిలకించేందుకు గ్రామ ప్రజలు ఎంతగానో ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై భారీ వాహనాలను నిలిపివేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మిగిలిన వాటిని ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎయిర్‌క్రాఫ్ట్‌లను జాతీయ రహదారిపై నిలిపేందుకు ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ సిద్ధంగా ఉందని ఎయిర్‌ఫోర్స్ కమాండర్, గ్రూప్ కెప్టెన్ ఆర్ఎస్ చౌదరి ప్రకటించారు. బాపట్ల జిల్లా అద్దంకి సమీపంలో రూపుదిద్దుకున్న ఇఎల్ఎఫ్ దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారిగా పనిచేయనుందని ప్రకటించారు. బాపట్ల-నెల్లూరు జిల్లాల మధ్య రెండు ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీలు తయారవుతున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎపి, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, ఒడిశా, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల్లో ఇఎల్ఎఫ్ ఎయిర్‌స్ట్రిప్‌లను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. అలాంటి రెండు ఎయిర్‌స్ట్రిప్‌లు ఇప్పటికే యుపి, రాజస్థాన్‌లలో పనిచేస్తున్నాయని తెలిపారు. వ్యూహాత్మక ప్రయోజనాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రెస్క్యూ, రిలీఫ్ ఆపరేషన్ల కోసం ఎయిర్‌స్ట్రిప్‌లను ఉపయోగించవచ్చని చెప్పారు. రోడ్డు లేదా రైలు మార్గాల్లో అంతరాయం ఏర్పడినప్పుడు విమానాలను నడపడానికి, అత్యవసర సమయంలో మనుషులను, సామగ్రిని తరలించడానికి వివిధ రాష్ట్రాల్లోని జాతీయ రహదారులపై ఎయిర్‌స్ట్రిప్‌లను అభివృద్ధి చేయాలని 2018లో కేంద్రం నిర్ణయించిందని తెలిపారు. బాపట్ల జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ఎయిర్ క్రాఫ్ట్ దిగడానికి సిద్ధమని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ వెల్లడించారు. వచ్చే ఏడాది భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో వాయుసేన అధికారి వి.ఎం.రెడ్డి, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, వాయుసేన అధికారులు పాల్గొన్నారు.

2024 జూన్ 2 వరకు 'స్థానికత'కు దరఖాస్తు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ నుంచి వచ్చిన వారికి స్థానికత దరఖాస్తు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఇందుకు సంబంధించిన జివోను ఈ నెల 27న రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి విడుదల చేశారు. తెలంగాణ నుంచి రాష్ట్రంలో స్థిరపడేందుకు వచ్చిన వారికి స్థానికత దరఖాస్తు చేసుకునేందుకు 2024 జూన్ 2వ తేది వరకు అవకాశం కల్పించారు. గతంలో ఈ గడువు 2021 జూన్ 2వ తేది వరకు మాత్రమే ఉంది. దీనిని 2024 వరకు పొడిగించారు. ఇందుకు సంబంధించిన గెజిట్‌ను కేంద్రప్రభుత్వం విడుదల చేసింది.

న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమైన ముఖ్యమంత్రి జగన్

తిరుపతిలో ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్శిటీ

- అమిత్ షాకు సిఎం వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్శిటీ (ఎన్ఎఫ్ఎస్‌యు)ని ఏర్పాటు చేయాలని కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరారు. గురువారం నాడు అమిత్ షాను ఆయన నివాసంలో సిఎం కలిశారు. దాదాపు అరగంట సేపు జరిగిన ఈ భేటీలో రాష్ట్రానికి వివిధ అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం, ఈ సందర్భంగా తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్శిటీ క్యాంపస్ ఏర్పాటు అంశాన్ని పరిశీలంచాలని కేంద్ర మంత్రి అమిత్ షాను సిఎం జగన్ కోరారు. ఈ యూనివర్శిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఉచితంగా అందించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ల వద్ద ప్రస్తావించిన అంశాలను కూడా మరోసారి హోంమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

గుండె పగిలింది

కందుకూరులో హృదయ విదారక దృశ్యాలు

- మృతుల కుటుంబాలకు చంద్రబాబు పరామర్శ
- ముగిసిన అంత్యక్రియలు

గడ్డం మధుబాబు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి-కందుకూరు, నెల్లూరు ప్రతినిధి

కందుకూరు గుండె పగిలింది. అనూహ్యంగా విరుచుకుపడిన మృత్యువును తలుచుకుని కుమిలిపోతోంది. బాధితుల కుటుంబాల్లోనే కాదు.. అందరిలో విషాదమే! ఎవరిని కదల్చినా జరిగిన దారుణాన్ని తలుచుకుని కంట తడిపెడుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడి సభలో జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మృతి చెందిన నెల్లూరు జిల్లా కందుకూరులో గురువారం కనిపించిన దృశ్యాలివి! అశ్రునయనాల మధ్య సాయంత్రం మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు ప్రమాద స్థలానికి గురువారం ఉదయమే మృతుల బంధువులు, పరిసరప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పోస్టు మార్టం నిర్వహించిన ఆసుపత్రి వద్ద భోరున విలపిస్తూ కనిపించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతం రోదనలతో నిండిపోయింది. సభకు వెళ్లిన వారు రాత్రి పొద్దుపోయిన తరువాతైనా ఇంటికి వస్తారని భావించిన సన్నిహితులకు పిడుగులాంటి వార్త తెలియడంతో గుండెలాగినంత స్థితి! ఆ స్థితిలోనే అందుబాటులో ఉన్న వాహనాల్లో ఆస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం ముగించి గురువారం ఉదయం మృతదేహాలను అప్పగించడంతో స్వగ్రామాలకు తరలించారు. ఆ గ్రామాల్లోనూ మిగతా 2లో

హైకోర్టుకు ముత్యాలరాజు హాజరు

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కార కేసులో పశ్చిమ గోదావరి జిల్లా పూర్వపు కలెక్టర్, ప్రస్తుతం సీఎం అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు గురువారం హైకోర్టుకు హాజరయ్యారు. అప్పట్లో నిడదవోలు తహసీల్దార్ శాస్త్రి, పంచాయతీరాజ్ సబ్ డివిజనల్ ఆఫీసర్ గంగరాజు కూడా వ్యక్తిగతంగా హాజరయ్యారు. జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాన్ని ఆక్రమించిన కొందరు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని, పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేయాలని గత ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇచ్చేందుకు స్వయంగా హాజరుకావాలని హైకోర్టు ఆదేశించింది. కరోనా కారణంగా హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయలేకపోయినట్లు వారి తరపు న్యాయవాది పి.సుభాష్‌రెడ్డి చెప్పారు. దీనిపై స్పందించిన జస్టిస్ బి.దేవానంద్.. కరోనా సమయంలో పంచాయతీ ఎన్నికలు జరిపారని, ప్రభుత్వ పథకాలు అమలు చేశారని, తామిచ్చిన ఉత్తర్వులకు కోవిడ్ అడ్డువచ్చిందా అని ప్రశ్నించారు. తమ ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యలను పరిశీలించేందుకు రికార్డులను అందజేయాలని ఆదేశించారు. విచారణను జనవరి 20కి వాయిదా వేశారు.

బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ : భారత్, రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన సూపర్ సోనిక్ మిస్సైల్ బ్రహ్మోస్ క్షిపణిని భారత వాయుసేన విజయవంతంగా పరీక్షించింది. దీన్ని సుఖోయ్-30ఎంకెఐ యుద్ధ విమానం నుంచి ప్రయోగించగా, బంగాళాఖాతంలోని ఓ లక్షిత ఓడను గురితప్పకుండా తాకింది. ఈ మేరకు భారత వాయుసేన ట్విట్టర్‌లో వెల్లడించింది. బ్రహ్మోస్ మిస్సైల్ రేంజి 450 కిలోమీటర్లు. దీన్ని భూతలం, గగనతలం, నౌకల్లోంచి ప్రయోగించవచ్చు. ధ్వనివేగం కంటే మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణిస్తుంది. గరిష్ఠంగా మాక్ 2.8 వేగాన్ని అందుకోగలదు. తాజా ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో, భారత వాయుసేన పోరాట సామర్థ్యం మరింత పెరిగింది.

వలస కార్మికులకు రిమోట్ ఓటు

- 16న నమూనా ప్రదర్శన
- పార్టీలకు ఇసి ఆహ్వానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉపాధి నిమిత్తం దేశంలోని వివిధ నగరాలకు వెళ్లే వలస కార్మికులు అక్కడి నుంచే తమ సొంత నియోజకవర్గ అభ్యర్థికి ఓటు వేయడానికి రిమోట్ ఓటింగ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) సిద్ధం చేసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రిమోట్ ఆర్‌విఎం పనితీరును ప్రదర్శించేందుకు జనవరి 16న ఎనిమిది జాతీయ, 57 రాష్ట్ర రాజకీయ పార్టీలను ఆహ్వానించామని, జనవరి 31లోగా వారి లిఖితపూర్వక అభిప్రాయాలను తెలియజేయాలని ఇసి కోరింది. ఈ విధానం అమలు చేయడంలో ఎదుర్కొనే చట్టపరమైన, కార్యాచరణ, పరిపాలనా, సాంకేతిక సవాళ్లపై పార్టీల అభిప్రాయాలను పొందడం కోసం దీనిని ప్రదర్శించనుంది. బహుళ నియోజకవర్గాల రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఆర్‌విఎం)ను అభివృద్ధి చేస్తున్నామని, దీనివల్ల ఒకే రిమోట్ పోలింగ్ బూత్ నుంచి బహుళ నియోజకవర్గాల ఓటర్లు వినియోగించుకునే అవకాశముందని తెలిపింది. రిమోట్ ఓటింగ్‌ను అమలు చేయడానికి 1950, 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం, ది కండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ 1961, ది రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోర్స్ రూరల్స్ 1960లను సవరించాల్సి ఉందని ఇసి పేర్కొంది. ఈ పరికరం దేశంలో ఎక్కడి నుంచైనా, ఎవరైనా తమ నియోజకవర్గానికి ఓటు వేయడానికి వీలు కల్పిస్తుంది. "2019 సార్వత్రిక ఎన్నికల్లో 67.4 శాతం పోలింగ్ నమోదైంది. 30 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోకపోవడం ఆందోళనకరం. ఓటరు తన కొత్త నివాస ప్రాంతంలో ఓటు నమోదు చేసుకోకపోవడానికి అనేక కారణాలున్నాయి. దీంతో చాలామంది ఎన్నికల్లో ఓటు వేయలేకపోతున్నారు. అంతర్గత వలసల (దేశంలోనే ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినవారు) కారణంగా ఓటు వేయలేకపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. విద్య, ఉద్యోగం, పెళ్లి ఇలా అనేక కారణాలతో చాలామంది స్వస్థలాలను వదిలి వెళ్తున్నారు. దేశంలో దాదాపు 85 శాతం మంది ఇలాంటి వారే. ఇలా వలస వెళ్లినవారు కూడా ఓటు హక్కును వినియోగించుకునేందుకే ఈ రిమోట్ ఓటింగ్‌పై దృష్టి పెట్టాం. వలస వెళ్తున్న వాళ్లలో 85 శాతం మంది సొంత రాష్ట్రంలోనే ఉంటున్నారు. ఇలాంటి వారికి సులభంగా ఓటు వేసే అవకాశం కల్పించే ఉద్దేశంతో ఇసి రిమోట్ ఇవిఎంలను తీసుకొస్తోంది. దేశంలో వలసలకు సంబంధించి ఎలాంటి అధికారిక సమాచారం లేదు. తాజాగా అభివృద్ధి చేసిన రిమోట్ ఇవిఎం.. ఒక్క దాంట్లోనే 72 నియోజకవర్గాలకు సంబంధించి ఓటు వేయొచ్చు" అని ఇసి పేర్కొంది.

హక్కుల సాధనకు సమరశీల పోరాటం

- విజఎల రాష్ట్ర 4వ మహాసభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

పండగకు పంచదార అందేనా?

- జిల్లాలకు అరకొరగా కేటాయింపులు
- కందిపప్పుదీ అదే పరిస్థితి

● లోపలి పేజీలో.. ●

సంక్షేమ పథకాలు కొనసాగించాలి

ఆహార భద్రతా చట్టం మార్పు తగదు

కందుకూరు సంఘటన దురదృష్టకరం : బివి రాఘవులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టం కింద పేదలకు అందిస్తున్న బియ్యం, గోధుమల పంపిణీలో మార్పు తీసుకురావడం తగదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. కందుకూరు సంఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికీ ఐదు కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేసిందన్నారు. ఇప్పుడు ఆ పథకాన్ని నెలవారీ ఇచ్చే రేషన్ బియ్యాన్ని కలుపుతామని చెప్పడం పేదలకు అన్యాయం చేయడమేనని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేస్తోందని విమర్శించారు. నవరత్నాల పేరుతో అమలు చేస్తోన్న సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల పింఛనుదారులను అనర్హులుగా ప్రకటించి వారికి నోటీసులు జారీ చేశాయం అన్యాయమని తెలిపారు. వైసిపి నవరత్నాలు నకిలీ రత్నాలుగా మారుతున్నాయని విమర్శించారు. ఎన్నికలు ఉంటే ఓమాట, ఎన్నికలు అయిన తర్వాత మరోమాట మాట్లాడడం మంచిదికాదన్నారు. వికలాంగ సర్టిఫికెట్ల కోసం ఆస్పత్రుల చుట్టూ పేదలు తిరగాల్సి వస్తోందని తెలిపారు. వితంతు పింఛన్లు మంజూరు చేయడానికి డెత్ సర్టిఫికెట్లు కోరుతున్నారన్నారు. గ్రామంలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ఈ విషయం తెలియదా? అని ప్రశ్నించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో రెండొందల యూనిట్లు విద్యుత్తు ఉచితంగా ఇస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో 300 యూనిట్లు వాడితే పింఛను రద్దు చేస్తున్నారని న్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టడాన్ని అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తుంటే, ఎపిలో మాత్రం స్వాగతించడం ప్రమాదమని పేర్కొన్నారు. అదానీ స్మార్ట్ మీటర్ల కంపెనీ పెడుతున్నారని, దీన్నిబట్టి కేంద్రం తీరు అర్థమవుతోందన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ఎపి సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి రూ.46 వేల కోట్లు రావాలని అడుగుతున్నారని, మిగతా 2లో

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు, పక్కన వి శ్రీనివాసరావు, మూలం రమేష్

స్టీల్‌ప్లాంట్ దీక్షలకు పిసిసి సంఘీభావం

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు చేపట్టిన దీక్షను పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంనాటికి 686వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడానికే మొగ్గుచూపుతున్నాయని అన్నారు. పార్లమెంట్‌లో వైసిపి ఎంపిలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పోరాటం చేస్తే స్టీల్‌ప్లాంటు ప్రయివేటుపరం కాదని పేర్కొన్నారు. బిజెపితో వైసిపి ప్రభుత్వం కుమ్మక్కయిందని అన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకుంటామని పేర్కొన్నారు. జనవరి 27న తలపెట్టిన ఉక్కు ప్రజా గర్జనలో పాల్గొంటామని తెలిపారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, జె.అయోధ్యరాం, కెఎస్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

క్యాలండర్‌ను ఆవిష్కరించిన ఆర్‌టిసి ఎమ్‌డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగుల కోసం ఎపిపిటిడి (ఆర్‌టిసి) బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ రూపొందించిన 2023సంవత్సరపు క్యాలండర్‌ను ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు ఆవిష్కరించారు. గురువారం విజయవాడలోని ఆర్‌టిసి హెడ్‌క్వార్టర్స్‌లో ఈ క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌పి శేషగిరిరావు, నాయకులు ఎంఆర్ కోటేశ్వరరావు, టి సూరిబాబు, ఎం వెంకటేశ్వరరావు, జె రాజు, విజె రత్నం, ఇ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో గ్రూప్-1 హాల్‌టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం నిర్వహించనున్న ప్రిలిమ్స్ పరీక్షల హాల్‌టికెట్లను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అభ్యర్థులు జూం౨.ఖజూ.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎపిపిఎస్‌సి కార్యదర్శి హెచ్ అరుణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 8వ తేదిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రెండు పూటలా ఈ పరీక్ష జరగనుంది. ఉదయం 10 నుంచి 12 గంటలకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పేపర్-2 నిర్వహించనుంది. మొత్తం 18 జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్ష జరగనుంది. పరీక్షా కేంద్రాల జాబితా కూడా వెబ్‌సైట్ ఉంది.

సహకారంతో విద్యాసంస్థల ఉన్నతి

- ఎఎన్‌యు పూర్వవిద్యార్థుల వెబ్‌సైట్ ఆవిష్కరణలో గవర్నర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాసంస్థల ఉన్నతికి పూర్వ విద్యార్థులు తమశక్తిమేర సహకరించి విద్యాదానంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం వెబ్‌సైట్, లోగోను రాజ్‌భవన్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పలు విద్యాసంస్థల్లో ఇప్పటికే పూర్వవిద్యార్థుల సంఘాలు క్రియా శీలకంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. అదేరీతిన నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థుల సంఘం కూడా మంచి పనితీరును కనపరచాలని ఆకాంక్షించారు. ప్రధానంగా విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తగిన సహకారం అందించాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం కార్యక్రమాలను ఉపకులపతి రాజశేఖర్ వివరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, రెక్టర్ వరప్రసాద్, రిజిస్ట్రార్ బి కరుణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్దయ్య, పూర్వ విద్యార్థుల సంఘం సంచాలకులు ఆంజనేయులు, సమన్వయకర్త సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పండగకు పంచదార అందేనా?

- జిల్లాలకు అరకొరగా కేటాయింపులు
- కందిపప్పుదీ అదే పరిస్థితి

లావేరు మండలంలోని గోదాంలో అరకొరగా ఉన్న సరుకుల నిల్వలు



డిడిలు చెల్లించాలంటూ డీలర్లకు వాట్సప్‌లో వస్తున్న సందేశాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

పండగ నెలలోనూ అందరికీ రేషన్ అందే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లు (ఎండియు) ద్వారా లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేస్తోంది. ఒకటో తేదీకి ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండగా జిల్లాలకు అంతంత మాత్రంగానే పంచదార, కందిపప్పు వచ్చాయి. ఈ పాటికే పౌరసరఫరాల గోదాములకు సరుకులు చేరాల్సి ఉండగా, అరకొరగా చేశాయి. డిసెంబర్ నెల ఆధారంగా ప్రభుత్వం కేటాయింపులు జరుపుతుందని అధికారులు చెప్తున్నారు. ఆ లెక్కల ప్రకారం చూసుకున్నా చాలా లోటు కనిపిస్తోంది. మరోవైపు పూర్తి స్థాయిలో సరుకులు అందుబాటులో లేకున్నా డిడిలు చెల్లించాలంటూ డీలర్లపై అధికారులు ఒత్తిడి చేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.రాష్ట్రంలో 1,45,50,854 రేషన్ కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుదారునికీ అరకేజీ పంచదార అందించాల్సి ఉంది. ఈ లెక్కన 7,506.72 టన్నుల పంచదార కేటాయించాల్సి, ఉండగా 2,877.96 టన్నుల మాత్రమే జిల్లాలకు ప్రభుత్వం సరఫరా చేయగలిగింది. ఒక్కో కార్డుపై కేజీ కందిపప్పును అందించాల్సి ఉంది. ఈ లెక్కన 15,717 టన్నులను సరఫరా చేయాల్సి ఉండగా, 3,994 టన్నులు మాత్రమే కేటాయించింది. డిసెంబర్‌లో పంపిణీ ఆధారంగానే కేటాయింపులు ఉంటాయని చెప్తుండడంతో జనవరి నెలలోనూ పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు అందే పరిస్థితి కనిపించడం లేదు. శ్రీకాకుళం జిల్లాలో 6,58,257 రేషన్ కార్డుదారులకు సరఫరా చేసేందుకు 652 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం. ఇప్పటివరకు 283 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. మరో 50 టన్నులు ఒకట్రెండు రోజుల్లో జిల్లాకు చేరనుంది.

అయినా, ఇంకా 319 టన్నులు కావాల్సి ఉండడంతో ఆ మేరకు తమకు కందిపప్పు పంపాలని జిల్లా అధికారులు పౌరసరఫరాల కమిషనర్‌కు లేఖ రాశారు. మిగిలిన కందిపప్పు జిల్లాకు చేరడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన పలు సంస్థలు రాష్ట్రానికి కందిపప్పును సరఫరా చేస్తున్నాయి. కందిపప్పు సరఫరాకు టెండర్లను పిలవాల్సి ఉన్నా, ఇప్పటివరకు ప్రభుత్వం ఆ పని చేయలేదు. ఇదంతా జరిగే సరికి పంపిణీ సమయం ముగిసిపోతుందనే చర్చ జరుగుతోంది. పంచదార నిల్వల పరిస్థితీ అలానే ఉంది. జిల్లాకు 380 టన్నుల పంచదార అవసరం కాగా, 202 టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

నిల్వలు లేకుండా డిడిలు తీయాలని డీలర్లపై తీవ్ర ఒత్తిడి

రేషన్ దుకాణాలకు కందిపప్పు, పంచదార సరఫరాకు డీలర్లు ప్రతి నెలా డబ్బులు చెల్లిస్తారు. సరుకుల లభ్యత, వినియోగం ఆధారంగా డీలర్లు డిడిలు తీస్తారు. ఈసారి సరుకుల లభ్యత తక్కువగా ఉందన్న సమాచారంతో డిడిలు తీయడానికి డీలర్లు ఆసక్తి కనబర్చడం లేదు. అప్పు చేసి డిడిలు తీసిన సొమ్ము ప్రభుత్వం దగ్గర ఉండిపోతే తాము వడ్డీలు చెల్లించాల్సి వస్తుందనే ఆలోచనతో ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో, పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు రంగంలోకి దిగి డీలర్లకు ఫోన్లు చేయడంతోపాటు వాట్సాప్ సందేశాలు పంపిస్తున్నారు. పంచదార, కందిపప్పు కోసం విధిగా డిడిలు తీయాలని ఆదేశిస్తున్నారు. డిడిలు తీయని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిస్తున్నారు. కందిపప్పు, పంచదార నిల్వలు ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఉన్నాయంటూ చెప్తున్నారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవడంతో తాము కట్టిన సొమ్ములతోనే కందిపప్పు, పంచదారను కొనుగోలు చేసి సరఫరా చేస్తోందేమో అన్న చర్చ డీలర్లలో సాగుతోంది.

కందుకూరు ఘటనకు చంద్రబాబుదే బాధ్యత

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కందుకూరులో జరిగిన తొక్కిసలాట ఘటనకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడే బాధ్యత వహించాలని వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ప్రభుత్వసలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పబ్లిసిటీ కోసమే ఇరుకు రోడ్లలో సభలు పెట్టి 8 మంది మృతికి కారకులయ్యారని విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డ్రోన్‌లతో షూటింగ్ చేయించుకునేందుకే ఉద్దేశపూర్వకంగా ఇరుకురోడ్లలో చంద్రబాబు రోడ్‌షో నిర్వహిస్తున్నారని సజ్జల ఆరోపించారు. కందుకూరులో జన సంద్రం అని ప్రచారం చేసుకోవాలనుకున్న టిడిపి ప్లాన్ బెడిసి కొట్టిందన్నారు. తప్పు తెలుగుదేశం చేసి పోలీసులపై నెపం నెట్టడం తగదన్నారు. పోలీసు సూచనలను కూడా పట్టించుకోలేదని, అనుమతి తీసుకున్న ప్రాంతం కంటే ముందుకెళ్లి సభను నిర్వహించారని తెలిపారు. 8 మంది చనిపోతే చంద్రబాబు మొహంలో పశ్చాత్తాపమే కనిపించడం లేదని, లెక్కలేనితనం, అహంకారమే కనిపిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ దుర్ఘటనను కూడా రాజకీయంగా తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. ఏది జరిగినా సెన్సేషన్ చేసుకోవాలన్నదే చంద్రబాబు ఆరాటమని, ఆయన వికత విన్యాసంలో ఈ ఘటన జరిగిందని భావిస్తున్నామని సజ్జల అన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా తన ప్రచారం కోసం పుష్కరాల్లో అమాయకులను బలి తీసుకున్నారని తెలిపారు.

దురదృష్టకరం : పవన్

టిడిపి సభలో జరిగిన తొక్కిసలాటలో 8 మంది చనిపోవడం, మరి కొందరు గాయపడటం దురదృష్టకరమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు కార్యకర్తలే కీలకమని అలాంటి వారు మృత్యువాత పడటం విచారకరమని ఆయన అన్నారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విషాద ఘటనపై రాజకీయాలొద్దు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్న
- మృతులకు ఎన్‌టిఆర్ భవన్‌లో నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కందుకూరు దుర్ఘటనలో మరణించినవారికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయమైన మంగళగిరిలోని ఎన్‌టిఆర్ భవన్‌లో నివాళు లర్పించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ విషాద ఘటనపై రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. వైసిపి ప్రభుత్వ దారుణాలతో ప్రజలు రగిలిపోతున్నారని, ఊహకందని విధంగా జనం తరలిరావడం వల్లే కందుకూరు సభలో తొక్కిసలాట చోటుచేసుకుందని అచ్చెన్న పేర్కొన్నారు. ఈ ఘటనలో చనిపోయినవారంతా తమ పార్టీ కుటుంబ సభ్యులేనని ఆయన తెలిపారు. రాష్ట్రాన్ని, ప్రజల్ని కాపాడే పోరాటంలోనే అసువులుబాసిన వీరంతా చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు నక్కా ఆనందబాబు, దేవినేని ఉమామహేశ్వరరావు, పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీలు రామకృష్ణ, జగదీశ్, మాజీఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, నాయకులు రామాంజనేయులు, కె బుచ్చిరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిలిజెన్స్ వైఫల్యం వల్లే..

రాష్ట్ర ప్రభుత్వం, ఇంటిలిజెన్స్ వైఫల్యమే కందుకూరులో తొక్కిసలాటకు కారణమని తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పేర్కొన్నారు. ప్రతిపక్షనేత సభలకు తరలివచ్చే ప్రజల్ని అంచనావేసి, అందుకు తగినట్టుగా భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత పాలకులపై లేదా అని ఆమె విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. లక్ష మందికి పైగా జనం వస్తే వారిని నియంత్రించేందుకు 40 మంది పోలీసులు ఏమూలకు సరిపోతారని ఆమె నిలదీశారు. ఈ దుర్ఘటనతో తాము విషాదంలో ఉంటే వైసిపి నేతలు రాక్షసానందం పొందుతున్నారని వాపోయారు. ఒంగోలు జిల్లా 'ఓదార్పు యాత్ర'లో విద్యుత్‌షాక్‌తో ఐదుగురు చనిపోయిన విషయం జగన్ మర్చిపోయారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు పబ్లిసిటీ వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోయారంటూ వైసిపి నేతలు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రికి ప్రధాన మంత్రి, గవర్నర్ స్పందించిన తర్వాత స్పందించడం దౌర్భాగ్యమని ఆయన పేర్కొన్నారు.

ఎన్ఆర్ఐ టిడిపి రూ.లక్ష చొప్పున సాయం

కందుకూరు దుర్ఘటనలో చనిపోయినవారికి కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ఎన్ఆర్ఐ టిడిపి - యుఎస్ఎ ప్రకటించింది. ప్రతి కుటుంబానికి రూ.లక్ష చొప్పున 8 కుటుంబాలకు రూ.8 లక్షలు అందించనున్నట్లు ఆ విభాగం కోఆర్డినేటర్ కోమటి జయరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఊహకందని విషాదమని పేర్కొన్నారు. టిడిపి తరపున రూ.15 లక్షలు, ఆ పార్టీ నాయకులు రూ.9 లక్షలు, ఎన్ఆర్ఐ విభాగం రూ.లక్షతో కలుపుకుని మొత్తం రూ.25 లక్షల సహాయం మృతుల కుటుంబాలకు అందనుందని ఆ పార్టీ నేతలు తెలిపారు.

ర్యాలీలో పాల్గొన్న మహిళా కార్మికులు

విశాఖలో జరిగిన సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

కార్మిక హక్కులను కాపాడుకుందాం

- పోరాటాలకు సిద్ధం కావాలి : సిహెచ్.నర్సింగరావు
- రెండో రోజుకు చేరిన కార్మిక చైతన్య యాత్రలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను పురస్కరించుకుని చేపట్టిన కార్మిక చైతన్య యాత్రలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. సత్యసాయి, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల నుంచి ప్రారంభమైన యాత్రలకు కార్మికులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా జిల్లాల్లో చైతన్య యాత్రలకు సిఐటియు నాయకులు ఘన స్వాగతం పలికారు. బైకులు, ఆటోలు, కార్లతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కొంతమంది సంపన్నుల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమైన యాత్ర రణస్థలం మీదుగా విజయనగరం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా రామతీర్థాలు కూడలి వద్ద సభ నిర్వహించారు.

శ్రీకాకుళం జిల్లా నుంచి చేపట్టిన చైతన్య యాత్ర విజయనగరం జిల్లాలోకి ప్రవేశించింది. పూసపాటిరేగ, డెంకాడ మండలాల మీదుగా విజయనగరం చేరింది. యాత్రకు దాసన్నపేట విద్యుత్తు భవనం వద్ద సిఐటియు నాయకులు ఘన స్వాగతం పలికారు. బైక్ ర్యాలీతో కోట జంక్షన్ వరకు చైతన్య యాత్ర సాగింది. అక్కడి నుంచి కార్మిక చైతన్య యాత్ర విశాఖ జిల్లాలోకి ప్రవేశించింది. తగరపువలస, డెయిరీ ఫారం, ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. డెయిరీ ఫార్మ్ నుంచి బైకులు, ఆటోలు, కార్లతో ర్యాలీ సాగింది. అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగసభ నిర్వహించారు. ఆయా చోట్ల సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైల్వే, పోర్టులు, రక్షణ, విద్యుత్ సహా అన్ని రంగాలను ప్రయివేటుపరం చేయాలని ప్రయత్నిస్తోందని, ప్రయివేటీకరణ జరిగితే ప్రజలపై భారాలు పెరుగుతాయని తెలిపారు. కార్పొరేట్లకు అధిక లాభాల కోసమే ప్రభుత్వాలు "ఈజ్ ఆఫ్ డూయింగ్" అమలు చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

చిత్తూరు జిల్లా కుప్పం నుంచి ప్రారంభమైన చైతన్య యాత్ర అన్నమయ్య జిల్లా పీలేరు మీదుగా కలకడ, సంబేపల్లె, రాయచోటి, రామాపురం, కడపకు చేరుకుంది. కడప నగరంలో నిర్వహించిన ర్యాలీని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.నారాయణ, ఎల్ఐసి డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి ప్రొద్దుటూరుకు చేరుకున్న జాతాను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వరూపరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయా ప్రాంతాల్లో జాతాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం ప్రాంతంలో కార్మిక చైతన్య యాత్రకు సిఐటియు నేతలు స్వాగతం పలికారు. అనంతరం ఆక్కడ నుంచి నగరంలోని నర్తకీ సెంటర్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. నర్తకీ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు కృషి చేస్తుందన్నారు. యాత్రలో సిఐటియు రాష్ట్ర నాయకులు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగించాలి

మొదటి పేజీ తరువాయి

దీనిపై ప్రధాని సానుకూలంగా స్పందించాలని కోరారు. ఇటీవల విశాఖ వచ్చిన ప్రధానికి ఇవే విషయాలు విన్నవించారని, అయినా, ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి రాలేదని అన్నారు. ప్రత్యేక హోదా ఏమైందని ప్రశ్నించారు. కందుకూరు ప్రమాదంలో మృతి చెందిన వారికి టిడిపి సాయం అందించిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇతోధికంగా సాయమందించాలని కోరారు.

సంక్షేమ పథకాల రద్దును నిరసిస్తూ వ్యాప్తంగా ఆందోళనలు : వి శ్రీనివాసరావు

తాము కోరిన కోర్కెలపై ప్రధాని సానుకూలంగా స్పందించారని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు, రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున పోరాడుతుంటే ప్రధాని ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు కోత పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగానే 1.30 లక్షల అమ్మఒడి లబ్ధిదారులకు తగ్గిస్తున్నారని విమర్శించారు. పింఛన్ల కోసం 2.30 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే, 3.80 లక్షల మందిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల రద్దును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో.. అప్పులమయం

- కావలి బహిరంగ సభలో చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-కావలి/నెల్లూరు ప్రతినిధి

ఎపిని అప్పుల రాష్ట్రంగా మారుస్తున్న సిఎం జగన్మోహరెడ్డిని గద్దిదించాలని టిడిపి అధినేత ఎన్ చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కావలి నియోజకవర్గంలో గురువారం పర్యటించారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, అజీజ్‌లు కావలి జాతీయ రహదారి వద్ద ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్‌షో నిర్వహించారు. కావలి పట్టణంలోని పొట్టిశ్రీరాముల విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సిఎం వల్ల రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కందుకూరులో జరిగిన సంఘటన తనను కలిచివేసిందన్నారు. టిడిపి నాయకత్వం ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు సాయం చేసిందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ రూ.రెండు లక్షలు సాయం చేశారన్నారు. ఇప్పటి వరకూ జగన్ స్పందించలేదన్నారు. కందుకూరు సంఘటనపై పోలీసు అధికారులు మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. సిఎం ఆదేశాలతో డిఐజి, ఎస్‌పి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కావలి ఎమ్మెల్యే రౌడీయిజం, దౌర్జన్యం ఎక్కువైందన్నారు. అతని కారణంగా అనేకమంది దళితులు నియోజకవర్గంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో మద్యం, గంజాయికి కేంద్రంగా మారిందన్నారు. యువత పెడదారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయికి బానిసలైతే యువతకు భవిష్యత్తే ఉండదన్నారు. కార్యమంలో టిడిపి నాయకులు కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, నాయకులు పి శ్రీనివాసులరెడ్డి, పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య, బొల్లినేని రామారావు, పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు 'బాలి' కుమారుడి దుర్మరణం

వాషింగ్టన్: ప్రముఖ చిత్రకారుడు 'బాలి' కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బాలి కుమారుడు మేడిశెట్టి గోకుల్ (45) అమెరికాలోని మంచు తుఫానులో చిక్కుకున్న గుంటూరుకు చెందిన దంపతుల్ని రక్షించబోయి ఆయన ప్రమాదంలో చిక్కుకుని మృతిచెందారు. గోకుల్ భార్య శ్రీదేవి, కుమార్తె మహతి (11) ఒడ్డునే ఉండి చూస్తున్న సమయంలో ఈ సంఘటన జరగడంతో వారంతా కుప్పకూలిపోయారు. గోకుల్ కుటుంబం 15ఏళ్లుగా అమెరికాలోనే స్థిరపడింది.

గుండె పగిలింది

మొదటి పేజీ తరువాయి

ఇదే స్థితి! పెద్ద సంఖ్యలో స్థానికులు మృతుల ఇళ్ల వద్దకు చేరుకున్నారు. కుటుంబీకులను ఓదార్చడానికి ప్రయత్నించారు. దీంతో ఆ పల్లెల్లో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మరణించిన వారి జీవిత భాగస్వాములను, తల్లితండ్రులను, పిల్లలను ఓదార్చడం ఎవరివల్ల కాలేదు. మరోవైపు చంద్రబాబునాయుడు మృతి చెందిన వారిలో ఏడుగురి నివాసాలకు టిడిపి నాయకులతో కలిసి వెళ్లారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. మరొకరి ఇంటికి శనివారం వెడతారని టిడిపి వర్గాలు తెలిపాయి.

డబ్బులు వద్దు సార్... నాన్న కావాలి!

ఓగూరు ఎస్సీ కాలనీలో మృతుడు గడ్డం మధుబాబు కుమారుడు కార్తికేయ చంద్రబాబుని చూసి 'మాకు డబ్బులు వద్దు సార్... నాన్న కావాలి' అంటూ పెద్దగా విలపించాడు. దీంతో చంద్రబాబు ఆ అబ్బాయిని దగ్గరకు తీసుకున్నాడు. గద్గద స్వరంతో ఓదార్చాడు. ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని చెప్పారు. అక్కడి నుండి గుర్రంవారి పాలెం కాకుమాని నాగరాజు, కొండముడిపాలెం ఎస్సీ కాలనీలోని కలవకూరి యానాది కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇతర గ్రామాల్లోనూ మృతుల నివాసాలకు వెళ్లి ఓదార్చారు. తెలుగుదేశం పార్టీ తరపున ఆర్థిక సహాయం అందించారు. చంద్రబాబు పరామర్శ అనంతరం మృతదేహాలకు కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

టిడిపి సాయం రూ. 25 లక్షలు

మృతుల కుటుంబాలకు టిడిపి 15 లక్షల రూపాయల సాయం ప్రకటించింది. ఆ పార్టీ నాయకులు ప్రకటించిన మొత్తాలతో కలుపుకొని మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఇస్తామని టిడిపి నాయకులు తెలిపారు. టిడిపి నాయకులు ఇంటూరు నాగేశ్వరరావు లక్ష రూపాయలు, ఇంటూరు రాజేష్ లక్ష రూపాయలు, ఎస్ లోహిత లక్ష రూపాయలు, బేబినాయన రూ.50 వేలు, కేతినేని చిన్నా రూ.50 వేలు, కంచర్ల సుధాకర్ రూ.2 లక్షలు, కంచర్ల శ్రీకాంత్ రూ.లక్ష, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ రూ.50 వేలు, కందుకూరు మాజీ ఎంఎల్ఎ పోతుల రామారావు రూ.50 వేలు, పి.సుధాకర్ రూ.50 వేలు, రాము రూ.50 వేలు చొప్పున ఎనిమిది కుటుంబాలకూ పరిహారాన్ని ప్రకటించారు.

పరిహారం ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మృతుల కుటుంబాలకు పిఎంఎన్ఆర్ఎఫ్ నుంచి ప్రధాని నరేంద్ర మోడీ రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరుపున మృతుల కుటుంబాలకు, రూ.2 లక్షలు చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రధాని, ముఖ్యమంత్రి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించారు : డిఐజి తివిక్రమవర్మ

నిబంధనలను ఉల్లంఘించడం వల్లే కందుకూరులో ప్రమాదం జరిగిందని గుంటూరు రేంజ్ డిఐజి తివిక్రమవర్మ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కందుకూరు డిఎస్‌పి ఇచ్చిన రూట్ మ్యాప్ ప్రకారం రోడ్‌షో, బైక్ షో జరగలేదన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించుకునేందుకు అనుకూలంగా ఏ ప్రాంతాన్ని అయితే పోలీసులు గుర్తించి అనుమతి ఇచ్చారో ఆ ప్రాంతానికి 46 మీటర్ల దూరం ముందుకు రావడం, అదే ప్రాంతంలో వాహనాలు నిలిపివేసి ఉండడం వల్ల ఒక్కసారిగా తొక్కిసలాట ప్రారంభం కావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేసేందుకు డిఎస్‌పి స్థాయి అధికారిని నియమించామని చెప్పారు. న్యాయనిపుణుల సలహాలు తీసుకొని చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌పి సిహెచ్ విజయరావు పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
భారత సరకార్ కా ఉపక్రమ్ — A Government of India Undertaking
Andhra — Corporation

అమరావతి బ్రాంచి : అమరావతి, గుంటూరు జిల్లా.

డిమాండ్ నోటీసు

టు : ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ గంగా ట్రేడర్స్, ప్రొప్రయిటర్ : ఆకురాతి బాబూరావు, అసిస్‌మెంట్‌నెం. 1021051879, రాజీవ్ గాంధీనగర్, 6వ లైన్, గుంటూరు - 522002. **2) శ్రీ ఆకురాతి బాబూరావు,** తండ్రి : రాఘవయ్య, హెచ్.నెం. 6-26-29, 2వ లైన్, సాలిపేట, డొంకరోడ్డు, గుండారావుపేట, 4వ లైన్, గుంటూరు - 522002. **కో ఆబ్లిగెంట్ / హామీదారు : శ్రీ కొడమల స్టీఫెన్,** తండ్రి : ప్రభుదాస్, హెచ్.నెం. 26-24-31, నగరంపాలెం, గుంటూరు - 522004

ఫెసిలిటీ / లోన్	లిమిట్స్	సమయం	బకాయి మొత్తము (రూ.) ది. 07-12-2022
OCC Loan	రూ. 50,00,000/-	25-11-2021	Rs. 51,51,886.88

ప్రాధమిక హామీ : షెడ్యూలు : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, ప్రస్తుత పెదకాకాని సబ్ డిస్ట్రిక్ట్, అగతవరప్పాడు గ్రామ పంచాయితీ ఏరియా, అగతవరప్పాడు గ్రామం, డి.నెం. 18/బి వద్ద ఒక పీసు భూమి ఎకరా 4.50 సెంట్లు మరియు డి.నెం. 119 వద్ద ఎకరా 2.95 సెంట్ల భూమి మొత్తం రెండు డోర్ నెంబర్లులోని భూమి ఒక్కటిగా మొత్తం ఎకరా 7.45 సెంట్ల విస్తీర్ణంలోని భూమి, పెదకాకాని మండల సర్వేయర్ జారీ చేసిన ఎండార్స్‌మెంట్ ప్రకారం ఎఫ్‌ఎల్‌ఆర్ నెం. 292/2019, తేది : 25-04-2019, అగతవరప్పాడు గ్రామ డి.నెం. 118/ఎ వద్ద 350 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము. హద్దులు : తూర్పు : నోముల సత్యనారాయణ గారి ఆస్తి, దక్షిణం : ఈడె సాంబిరెడ్డి గారి ఆస్తి, పడమర : రోడ్డు, ఉత్తరం : రోడ్డు. **పై సరిహద్దుల మధ్యగల భూమి నందలి 350 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము మాత్రమే.**

అమ్మా / అయ్యా,

విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి - నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు **ఓసిసి లోన్ క్రింద మా అమరావతి బ్రాంచి** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ **ఖాతాను ది. 07-12-2022న నిరర్ధక ఆస్తిగా (NPA)** వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుపబడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేద అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 17-12-2022 — **సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

సిజెఐని కలిసిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్‌ను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల పర్యటన అనంతరం విజయవాడ వచ్చిన సిజెఐ నేరుగా నోవాటెల్ హోటల్‌కు చేరుకున్నారు. తొలిసారి రాష్ట్రానికి రావడంతో సిఎం మర్యాద పూర్వకంగా కలిశారు. వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. సుమారు అరగంటపాటు వివిధ అంశాలపై చర్చించారు.

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన అథారిటీ బృందం

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రాజెక్టు అథారిటీ బృందం అథారిటీ బృందం గురువారం పరిశీలించింది. నూతన సిఇఒ శివనందన్‌కుమార్ నేతృత్వంలో మెంబర్ సెక్రటరీ ఎం.రఘురాం, చీఫ్ ఇంజినీర్లు రాజేష్ కుమార్, వెంకటసుబ్బయ్య, డైరెక్టర్ పి.దేవేంద్రరావు బృందం తొలుత పోలవరం ప్రాజెక్టులో స్పిల్ వే, ఫిష్ లాడర్, గైడ్ వాల్‌బండ్, ఎగువ, దిగువ కాపర్ డ్యాములు, డయాఫ్రమ్ వాల్, గ్యాప్ 1, 2, 3 కాంక్రీట్ వాల్ నిర్మాణాలను, తూర్పుగోదావరి జిల్లా అంగులూరు సమీపంలో నిర్మిస్తున్న పవర్ ప్రాజెక్ట్, దేవరగొంది, మామిడి గొంది, జంటగుహలు, చేగొండపల్లి సమీపంలో నిర్మించిన హెడ్ రెగ్యులేటర్, తోటగొంది సమీపంలో నిర్మించిన ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ రెగ్యులేటర్లను పరిశీలించారు. పనుల వివరాలను జలవనరులశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోలవరం ప్రాజెక్ట్ అతిథిగృహంలో రాత్రికి బస చేసి శుక్రవారం ఉదయం పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ పనులను పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో సిఇ సుధాకర్ బాబు, క్వాలిటీ కంట్రోల్ ఇఇ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు మల్లికార్జునరావు, పుల్లారావు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సమరశీల పోరాటం

విఒఎల రాష్ట్ర 4వ మహాసభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

ఉద్యోగ భద్రత, కనీస వేతనం, నిర్దిష్ట పనిగంటల సాధనకు విఒఎలు సమరశీల ఐక్యపోరాటాలు నిర్వహించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిర్బంధాలు ఎదుర్కొని పోరాడకపోతే హక్కులు, సదుపాయాలు సాధించుకోవడం సాధ్యం కాదన్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర నాలుగో మహాసభ జిల్లా కేంద్రమైన అనకాపల్లిలోని గవరపాలెం బి రాంబాబు ప్రాంగణంలోని వి రత్నంనగర్ (వివి రమణ రైతు భారతి కల్యాణ వేదిక)లో గురువారం ప్రారంభమైంది. యూనియన్ జెండాను సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రూపావతి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసేవారిపై ప్రభుత్వాలు నిర్బంధ చర్యలకు దిగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.ఎనిమిది వేల వేతనంతో విఒఎలు ఎలా బతుకుతారో ప్రభుత్వం ఆలోచించకపోవడం అన్యాయమన్నారు.

మోడీ, జగన్ ప్రభుత్వాలు రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సహ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలు, సేవా రంగాలు, ఆర్థిక సంస్థలను గుండుగుత్తగా అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను బహుళజాతి సంస్థలు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు మారుస్తున్నాయన్నారు. కార్మిక చట్టాల్లేకపోతే కార్మికులకు రక్షణ ఉండదని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మహాసభలో కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతూ విఒఎల సమస్యలపై చేసిన పోరాటాలు, అనుభవాలు, సాధించిన విజయాలు వివరించారు. సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ 64 రద్దయ్యే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. విఒఎలను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలను పోరాటాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఐక్య పోరాటాలతో కొన్ని హక్కులు సాధించుకోగలిగామని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె లోకనాథం, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో దెబ్బతింటున్న ప్రజలను కలుపుకొని బలమైన ఉద్యమాలు నిర్వహించాలన్నారు. విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కె సూరిబాబు, ఎపి గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ బాలకృష్ణ పాల్గొన్నారు.

విఒఎల రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

దళితులపై దాడులను అరికట్టండి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని, ఈ దాడులను నియంత్రించేందుకు ఎస్‌సి కమిషన్ ప్రత్యేక చర్యలను తీసుకోవాలని కెవిపిఎస్ కోరింది. దళిత సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన చేసి అధికారులకు ఆదేశాలను ఇవ్వాలని డిమాండ్ చేసింది. గురువారం రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్‌ను కెవిపిఎస్ ప్రతినిధి బృందం కలసి వినతి పత్రం అందజేసింది. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, జి క్రాంతి కుమార్, సమతా సైనిక దళ్ రాష్ట్ర అధ్యక్షులు హైకోర్ట్ న్యాయవాది పాలేటి మహేశ్వరరావు, న్యాయవాది విద్యాచరణ్‌తోపాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలనుండి వచ్చిన దళితులు ఉన్నారు. దళితులపై జరుగుతన్న దాడులపై పోలీసుకేసులు పెడితే గ్రామపెద్దలు జోక్యం చేసుకొని కేసులను నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. బెదిరింపులకు పాల్పడుతూ రాజీ కావాలని బెదిరిస్తున్నారని అన్నారు. జస్టిస్ పున్నయ్య కమీషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. వివక్షతను రూపుమాపేందుకు వారంలో ఒకరోజు మండల అధికారులు గ్రామ పర్యటనలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల 30వ తేదీని పౌరహక్కుల దినం జరిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యాచారాలు, హత్యలు జరిగిన ప్రాంతాలకు జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు 24 గంటల్లో సందర్శించి బాధితులు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కోర్టులు, పోలీసుల వద్ద పెండింగులో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసులపై సమీక్ష జరిపి బాధిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, భూములు, ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి

- రాజ్‌భవన్ ముట్టడి చేపట్టిన సిపిఐ
- నాయకుల అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. ఫెడరలిజాన్ని కాపాడాలని, గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన గురువారం రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. గాంధీనగర్లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరారు. మార్గమధ్యలో పోలీసులు అడ్డుకుని రామకృష్ణతో పాటు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు, దర్గాంబ,రమణారావు తదితరులను అరెస్టు చేసి వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. జగన్ ఢిల్లీ వెళ్లి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. గవర్నర్లను అడ్డం పెట్టుకుని బిజెపి యేతర రాష్ట్రాల ప్రభుత్వాలను పడగొట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు, తెలంగాణా వంటి అన్ని రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేశారని వివరించారు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే తమ ఉద్దేశమని, అందుకోసం చేపట్టిన ఆందోళనలో ప్రజాస్వామ్యవాదులందరూ కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల సీతారావమ్మ, నాయకులు నజీర్, సూరిబాబు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు కార్పొరేషన్ డిప్యూటి కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పిపిఎస్ నాయకులు ఇ.పుల్లారెడ్డి , తదితరులు

పింఛన్లను పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వం తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బాధితులు కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.పుల్లారెడ్డి మాట్లాడుతూ వివిధ కారణాలతో వికలాంగులు, వితంతువులు, వృద్ధుల, ఒంటరి మహిళల పింఛన్లను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఆర్థిక భరోసాగా ఉన్న పింఛన్లను తొలగించడంతో వారంతా వీధిన పడాల్సి వచ్చిందని తెలిపారు. సంపన్నులను, ఇసుక, మద్యం మాఫియాలను వదిలేసి వికలాంగులు, వితంతువులు, వృద్ధుల పింఛన్లు రద్దు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎలాంటి ఆంక్షలు లేకుండా పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే జరిపి అర్హులైన వారందరికీ పింఛన్లు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనలో సంఘం నగర నాయకులు ఎం.నాగరాజు, ఎస్.నౌషద్, పి.ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు సర్కారు నేమ్‌ప్లేట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే ఇళ్లకు నేమ్ ప్లేట్లను ఏర్పాటు చేయన్నారు. గోడలకు వార్లి పెయింట్‌ను వేయనున్నారు. ఈ మేరకు గృహ నిర్మాణ సంస్థ ఇప్పటికే టెండర్లను పిలిచింది. ఒక్కో నేమ్ ప్లేట్‌కు 97 రూపాయల చొప్పున వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. దీనికోసం టెండర్లను పిలవడంతోపాటు, నెక్స్‌టోరా సొల్యూషన్స్ అనేక విశాఖకు చెందిన సంస్థకు టెండర్ ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ సంస్థ మొత్తం 1,06,407 ఇళ్లకు నేమ్ ప్లేట్స్ తయారు చేయాల్సి ఉంటుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన పేరుతోపాటు కేంద్రానికి చెందిన ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం లోగో కూడా ఉంటుంది. అలాగే ఇంటి గోడలపై జానపద, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే బొమ్మలను వార్లి ఆర్ట్‌గా చిత్రించేందుకు కూడా నిర్ణయించారు. దీనికోసం ఒక్కో ఇంటికి 1,096 రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ టెండర్లను కూడా నెక్స్‌టోరా సంస్థే దక్కించుకుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ప్రకటన
టెండర్ నెం.30/2022-23, విట్ నెం.: 95 నుండి 99 తేది : 28-12-2022
సూపరింటెండెంట్ ఇంజనీర్, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు పరిధిలోని వివిధ నియోజకవర్గంలలో 5 పనులకు అంచనా విలువ రూ.247.00 లక్షలతో ఓ.టి.యస్. గ్రాంట్ క్రింద మంజూరైన పనులకు టెండర్ తేది : 02-01-2023 నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ఫ్లాట్ ఫామ్ www.apeprocurement.gov.in లో చూడగలరు. సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు.

इंडियन बैंक Indian Bank
इलाहाबाद ALLAHABAD
ప్రకాశం రోడ్ బ్రాంచ్: 27-6-170, అన్నపూర్ణ థియేటర్ పక్కన, ప్రకాశంరోడ్, గవర్నర్‌పేట, విజయవాడ 520002.

అనుబంధం 4 రూల్ 8(1), సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002
స్థిరాస్థి కొరకు స్వాధీనతా నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 సెక్షన్ 13(2), సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8,9 ప్రకారం సంక్రమించిన అధికారాల మేరకు దిగువ సంతకందారైన ఇండియన్ బ్యాంక్ అధీకృత అధికారి మా బ్యాంకు ప్రకాశం రోడ్ బ్రాంచ్ నుండి స్థిరాస్తుల హామీపై రుణసౌకర్యం పొందిన రుణగ్రహీతలు/ హామీదారులు 1. అర్జంపూడి రమేష్ (రుణగ్రహీత), తండ్రి అర్జంపూడి రామకోటేశ్వరరావు, డోర్ నెం. 39-3-32, శ్రీలక్ష్మీ గణపతి ప్లాజా, మసీదు వీధి, లబ్బీపేట, విజయవాడ, కృష్ణా జిల్లా, 2. అర్జంపూడి రామకోటేశ్వరరావు, (సహరుణగ్రహీత), డోర్ నెం. 39-3-32, శ్రీలక్ష్మీ గణపతి ప్లాజా, మసీదు వీధి, లబ్బీపేట, విజయవాడ, కృష్ణా జిల్లా, 3. శ్రీమతి అర్జంపూడి వెంకటరమణ, (హామీదారు/తనఖాదారు), భర్త అర్జంపూడి రామకోటేశ్వరరావు, ఫ్లాట్ నెం. 3, 3వ ఫ్లోర్, అన్నపూర్ణ అపార్ట్‌మెంట్స్, డోర్ నెం. 39-2-53/1, లబ్బీపేట విజయవాడ లకు నోటీసు అందిన 60 రోజుల్లోగా బకాయి మొత్తమును పూర్తిగా చెల్లించాల్సిందిగా కోరుతూ ది. 08-09-2022న డిమాండ్ నోటీసు జారీ చేశారు. ది. 26-12-2022 నాటికి బకాయి మొత్తము రు. 10,72,015/- (పదిలక్షల డెబ్బయ్‌రెండు వేల పదిహేను రూపాయలు మాత్రము). చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఈ మొత్తమునకు 27-12-2022 నుండి అంగీకరించిన వడ్డీ రేటు ప్రకారం వడ్డీ, వర్తించే ఖర్చులు, ఛార్జీలు కలుపబడతాయి.

అయితే రుణగ్రహీతలు/హామీదారులు నోటీసులో నిర్దేశించిన గడువులోగా బకాయి మొత్తమును చెల్లించటంలో విఫలం కావటంతో పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4)తో పాటు రూల్స్ 8,9 ప్రకారం సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలు తమ రుణసౌకర్యం కోసం తనఖా పెట్టిన దిగువ పేర్కొనబడిన స్థిరాస్తులను ది. 27-12-2022న స్వాధీనం చేసుకున్నారని ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకానికి, ముఖ్యంగా రుణగ్రహీతలు/హామీదారులకు తెలియచేయటమైనది. బకాయి మొత్తము రు. 10,72,015/- (పదిలక్షల డెబ్బయ్‌రెండు వేల పదిహేను రూపాయలు మాత్రము)తోపాటు చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యే వరకూ జమ అయ్యే వడ్డీ, వర్తించే ఇతర ఖర్చులు, ఛార్జీలు కలిపిన ఈ మొత్తమునకు హామీగా బ్యాంక్ ప్రకాశంరోడ్ బ్రాంచ్ ఆధీనంలో వున్న ఈ స్థిరాస్తులపై ఎటువంటి లావాదేవీలకు పాల్పడరాదని పైన పేర్కొన్న చట్ట నిబంధనల మేరకు సాధారణ ప్రజానీకానికి, రుణగ్రహీతలకు సూచించటమైనది.

తనఖా ఆస్తుల వివరాలు షెడ్యూలు ఎ: విజయవాడ లబ్బీపేట, పిచ్చయ్య వీధి బ్లాక్ నెం. 20, రెవిన్యూ వార్డు నెం. 10, మొగల్రాజపురం గ్రామ రెవిన్యూ ఎన్‌టిఎస్ నెం. 506, మున్సిపల్ వార్డు 28లో వున్న మొత్తం 999-4/9 చ.గజాల విస్తీర్ణంలో అవిభక్త, అనిర్దేశిత భాగం అయిన 41.64. చ.గజాల స్థలం. హద్దులు: తూర్పు. పిచ్చయ్య వీధి (మున్సిపల్‌రోడ్), దక్షిణం. మోహన్‌దాస్, ఇతరులకు చెందిన ఆస్థులు, పశ్చిమం. మోహన్‌దాస్, ఇతరులకు చెందిన ఆస్థులు, ఉత్తరం. ఖాసిం, ఇతరులకు చెందిన ఆస్థులు. షెడ్యూలు బి: అన్నపూర్ణ అపార్ట్‌మెంట్స్ 3వ ఫ్లోర్‌లో 704 చ.అడుగుల విస్తీర్ణంలో వున్న ఫ్లాట్ నెం. 3 (అసెస్మెంట్ నెం. 575705), కామన్ ఏరియా 30 చ.అడుగులు, కార్ పార్కింగ్ 120 చ.అడుగులతో కలిపి. హద్దులు: తూర్పు.కారిడార్, లిఫ్ట్, దక్షిణం. ఫ్లాట్ నెం. 4, పశ్చిమం. ఓపెన్ టు స్కై, ఉత్తరం. ఓపెన్ టు స్కై.

తేదీ: 26-12-2022, స్థలం విజయవాడ, సం.అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి..

- ప్రభుత్వం స్పందించకుంటే పతనం తప్పదు
- అనంతలో ముగిసిన పేదల పాదయాత్ర
- సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మహాధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఏళ్ల తరబడి సొంతిళ్లు లేక దీనావస్థలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలంటూ అనంతపురం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించాలని, సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర గురువారం ముగిసింది. గుత్తి నుంచి ప్రారంభమైన పాదయాత్ర పలు మండలాల మీదుగా అనంతపురం నగరానికి చేరుకుంది. సోములదొడ్డి నుంచి సిపిఎం నాయకులు పేదలతో కలిసి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం కలక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటి అద్దెలు కట్టలేక బతకు భారమై జీవనం సాగించలేని దుస్థితిలో వేలాది పేద కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఈ కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అటు ప్రభుత్వం, ఇటు అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. కబ్జాదారులు వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నా పట్టించుకోని అధికారులు పేదల సెంటు స్థలంలో గుడిసెలు వేసుకుంటే వెంటనే తొలగిస్తున్నారని అన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ పేదలను విస్మరిస్తే వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. జనవరి నెలలోపు జిల్లాలోని పేదలకు ఇళ్ల స్థలాలు, గృహాలు, సాగుదారులకు భూములు ఇవ్వకుంటే తాము భూ స్వాధీనం చేసుకుని పంచుతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలపై కలెక్టరేట్ ఎఒ తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి సావిత్రి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి శ్రీనివాసులు, ఎస్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

మహాధర్నాలో ప్రసంగిస్తున్న వి రాంభూపాల్

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి - తిరుమల

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై.చంద్రచూడ్ గురువారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని, శ్రీ వరాహస్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు వచ్చిన జస్టిస్ డివై.చంద్రచూడ్‌కు టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఇఒ (ఎఫ్‌ఎసి) అనిల్ కుమార్ సింఘాల్, ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో శ్రీవారి చిత్రపటం, టిటిడి క్యాలెండర్, డైరీలను చైర్మన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఇఒ (ఎఫ్‌ఎసి) వీరబ్రహ్మం, సివిఎస్ఒ నరసింహ కిషోర్, ఆలయ డిప్యూటీ ఇఒ రమేష్ బాబు పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
బ్రాంచి ఆఫీస్ యాక్సిస్ బ్యాంక్ లి., డోర్ నెం.22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003.

స్వాధీనత ప్రకటన (రూల్-8(1)(స్థిరాస్తి వివరములు)

ఇందుమూలంగా యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ (ఇంతకు పూర్వము యు.టి.ఐ బ్యాంక్ లిమిటెడ్ గా తెలిసిన) యొక్క అధీకృత అధికారి వారి నమోదిత కార్యాలయము: "త్రిసూల్", సామర్తేశ్వర్ గుడి ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006, ఇతర ప్రదేశములలో ఉన్న బ్రాంచీలు నందు గల యాక్సిస్ బ్యాంక్ లి., డోర్ నెం. 22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003 వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు అందలి సెక్షన్ 13(12) తో కలిపి చదవబడే ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 3 క్రింద తమకు లభించిన అధికారములను వినియోగించుకుంటూ ఈ దిగువ తెలియజేసిన ఋణగ్రహీతలను బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేసినారు.

అప్లికెంట్/కో-అప్లికెంట్/హామీదారుల యొక్క పేర్లు / ఖాతా నెం.లు	ఋణం రూ.లలో	స్థిరాస్తి వివరములు
1) మెస్సర్స్ శ్రీ మురళీ కృష్ణ బుజ్జి ఫిల్లింగ్ స్టేషన్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీమతి గంగిరెడ్డి సీతాలక్ష్మి, భర్త. జి రాధాకృష్ణ, డి.నెం. 21/28, మెయిన్ రోడ్, ఫ్యాక్టరీ సెంటర్, తిరువూరు, కృష్ణా జిల్లా-521235. 2) శ్రీమతి గంగిరెడ్డి సీతాలక్ష్మి, భర్త. జి రాధాకృష్ణ, డి.నెం. 5-220, మదిరా సెంటర్, తిరువూరు, కృష్ణా జిల్లా-521235. 3) శ్రీ గంగిరెడ్డి రాధాకృష్ణ, తండ్రి. బలరామస్వామి, డి.నెం. 5-220, మదిరా సెంటర్, తిరువూరు, కృష్ణా జిల్లా-521235. లోన్ నెంలు. : 918030097201192 డిమాండ్ నోటీసు తేది : 19.10.2022 స్వాధీనత తేది : 23.12.2022	రూ. 40,68,676/- (అక్షరాల నలభై లక్షల అరవై ఎనిమిది వేల ఆరు వందల డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే) తో కలిపి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర సంబంధిత ఖర్చులు, డేమేజీలు మొదలగునవితో పాటుగా స్వాధీనత మరియు ఈ ఆస్తులను విక్రయం చేయుటకు మాచే చేయబడిన ఖర్చులతో సహా కలిపి చెల్లించవలెను.	కృష్ణా జిల్లా, తిరువూరు మండలం, నదిం తిరువూరు గ్రామం, రెవిన్యూ వార్డు నెం. 21, డి.నెం. 21-36-4, సర్వే నెం. 194/4 లో 229.90 చ॥గ॥ల విస్తీర్ణం గల నివాస ఆస్తి అందుగల ఆర్‌సిసి రూఫ్ మరియు నిర్మాణముల యొక్క దస్తావేజు నెం. 1999/2007, తేది. 05.10.2009, ఎస్‌ఆర్‌ఓ-తిరువూరు ప్రకారం యావత్తు ఆస్తి. హద్దులు : తూర్పు : చిమిరాల లక్ష్మీకుమారి గారి స్థలం-38 అ॥లు, పడమర : నల్లా చిట్టిబద్రయ్య గారి స్థలం-39.06 అ॥లు, ఉత్తరం : 14 లింకుల వెడల్పు రోడ్ - 53.03 అ॥లు, దక్షిణం : రోడ్-53.05 అ॥లు.

పైన తెలియజేయబడిన నోటీసు నందు బకాయి మొత్తములను డిమాండ్ నోటీసులు స్వీకరించిన 60 దినములలోగా చెల్లింపు చేయవలసినదిగా కోరినారు. అయినప్పటికినీ సదరు నోటీసులు నందు చెప్పబడిన బకాయి మొత్తములను తిరిగి చెల్లింపులో ఋణగ్రహీతలు విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు తమకు పై చట్టం యొక్క 13(4) తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 8తో కలిపి చదవబడే ప్రకారం తమకు లభించిన అధికారములను వినియోగించుకుంటూ పైన చెప్పబడిన తేదీలలో సదరు ఆస్తులను స్వాధీనత చేసికొని ఉన్నారని ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋనగ్రహీతలను హెచ్చరించడమైనది. సాధారణ ప్రజానీకము మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు ఈ నోటీసు ద్వారా చేయు హెచ్చరిక ఏమనగా పైన చెప్పబడిన ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదు, అట్లు జరపబడిన ఎడల అట్టి లావాదేవీలు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, వారి యొక్క పైన చెప్పబడిన నోటీసు నందు బకాయి మొత్తములు మరియు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు మొదలగునవి ఛార్జ్‌కి లోబడి ఉండును.

సదరు పై సర్ఫేసి 2002 చట్టం యొక్క సెక్షన్ 13 నందు సబ్-సెక్షన్ 8 లో గల నిబంధనలకు లోబడి ఋణగ్రహీతలు తమ సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి విడిపించుకొనుటకు శ్రమించు కాలపరిమితిని దయచేసి గమనించవలసినదిగా కోరడమైనది.

తేది : 23.12.2022 ప్రదేశము : నెల్లూరు సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

విశ్వవిద్యాలయాల విసిలతో ఉన్నతి విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

దేశాభివృద్ధిలో విద్యార్థులను భాగస్వామ్యం చేయండి

రక్షణ మంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారు జి సతీష్ రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశాభివద్ధిలో కీలక పాత్ర పోషించేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యా సంస్థలపై ఉందని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారు జి సతీష్ రెడ్డి అన్నారు. గురువారం గుంటూరు జిల్లా లాం లోని ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అడిటోరియంలో రాష్ట్ర ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు నాల్గోవ సమావేశం జరిగింది. 'ఉన్నత విద్యాసంస్థలు సామాజిక బాధ్యతలు' అనే అంశంపై రెండు రోజులపాటు జరగనున్న సదస్సులో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, డీమ్డ్ సెంట్రల్ యూనివర్సిటీల ఉప కులపతులు పాల్గొన్నారు. తొలి రోజు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె హేమచంద్రారెడ్డి అధ్యక్షత వహించిన సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న సతీష్ రెడ్డి మాట్లాడారు. విద్యాసంస్థల్లో అధ్యాపకుల నియామకం, వసతులు, విద్యావిధానాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మౌలిక వసతులను కలిసి కట్టుగా అభివద్ధి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రాల్లోని ఐఐటిలు, రాష్ట్ర, కేంద్ర విశ్వవిద్యాలయాలను అనుసంధానం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు సరళమైన సాంకేతికతలను రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంపుదల కోసం కషి చేస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ, వృత్తి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సంవత్సరానికి రెండు నెలలు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టును చేయిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2021 విద్యా సంవత్సరంలో రెండు లక్షల మంది విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు పూర్తి చేశారన్నారు. రాష్ట్ర కళాశాల విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ విద్యలో నాణ్యత, మౌలిక సదుపాయాలు, సాంకేతికత పెంపొందించేలా విద్యా సంస్థలు దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ ఎ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుదలలో మిగిలిన రాష్ట్రాల కంటే మన రాష్ట్రం మెరుగ్గా ఉందని తెలిపారు. సమావేశంలో జెఎన్‌టియు హైదరాబాదు మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ డిఎన్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు, సెక్రటరీ వై నజీర్ అహ్మద్, అకడమిక్ ఆఫీసర్ జి శ్రీరంగం మాధ్యు పాల్గొన్నారు.

17 మంది వ్యవసాయ కూలీలకు అస్వస్థత

ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)

మొక్కజొన్న పైరులో గుళికలు చల్లేందుకు వెళ్లిన 17 మంది వ్యవసాయ కూలీలు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా పర్చూరు మండల పరిధిలోని చిననందిపాడులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... చిలకలూరిపేట మండలం దండమూడి గ్రామానికి చెందిన 17 మంది వ్యవసాయ కూలీలు మొక్కజొన్న పంటలో గుళికలు చల్లేందుకు చిననందిపాడుకు వచ్చారు. పొలంలో గుళికలు చల్లిన అనంతరం మధ్యాహ్న భోజనం చేశారు. గుళికల ప్రభావానికి కొద్దిసేపటికే అందరూ అస్వస్థతకు గురై చేలోనే వాలిపోయారు. స్థానిక రైతులు స్పందించి బాధితులను ట్రాక్టర్‌లో పెదనందిపాడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రాణాపాయం లేదని తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పబ్లిక్ నోటీసు
ICICI Bank
బ్రాంచ్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్స్, బొమ్మనా హాల్లి, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068.

కింది రుణగ్రహీతలు బ్యాంక్ నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క అసలైన మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) కింద వారికి నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైంది.

క్ర. సం	రుణగ్రహీత/సహా-రుణగ్రహీత/హామీదారుడు/ (లోను ఖాతా నంబర్) & చిరునామా	సెక్యూర్డ్ అస్సెట్ ఆస్థి చిరునామా/అమలుచేయబడిన ఆస్థి	పంపబడిన నోటీసు తేదీ/నోటీసు తేదీ నాటికి బకాయిలు	ఎన్‌పిఎ తేది
1.	కసరగడ్డ నాగేశ్వరరావు/ కసరగడ్డ సుధారాణి/ LBGTR00005043233/ LBGTR00005052611/ డో.నం.347 2 బి1 కారంపుడి రోడ్డు వినుకొండ మున్సిపాలిటీ పాత డో.నం.29 197 5 గుంటూరు జిల్లా కొత్త డో.నం.29 1060/వినుకొండ-533647	గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ మున్సిపాలిటీలో వినుకొండ ఉపజిల్లా, వినుకొండ డో.నం.347/2-బి-1 విస్తీర్ణం ఎసి. 0.92 సెంట్లు, బేరింగ్ డో.నం.29-197/5 మరియు మున్సిపల్ రికార్డుల ప్రకారం ప్రస్తుత డో.నం.29-1060 ధాబా ఇల్లు దీని హద్దులు: తూర్పు:షేక్ ఆదం సాహెబ్ యొక్క ఇల్లు, ఉమ్మడి గోడ-50 అడుగులు., పడమర: సముద్రాల రామ బ్రంహం యొక్క సైట్-50 అడుగులు., ఉత్తరం: 30 లింక్స్ వెడల్పు ఆక్సెస్ రోడ్డు-13'-3"., దక్షిణం: కొండపనేని సత్యనారాయణ యొక్క సైట్-13'-3". ఈ సరిహద్దుల పరిధిలో 72.6 చ.గజాలు. సైట్ మరియు ఆ 612 చ.అడుగుల ఒక్కొక్క గ్రౌండ్, 1వ మరియు 2వ అంతస్తుల ఇల్లు మరియు అన్నీ ఇతర సౌకర్యములతో.	18.10.2022 Rs. 23,48,771.00/-	30.04. 2022

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

తేదీ: 30 డిసెంబర్, 2022,
ప్రదేశం: గుంటూరు.
అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

సబ్‌ప్లాన్ అవశ్యం

సమాజంలో అణగారిన తరగతులైన షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజల అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికా వ్యయంలో ప్రత్యేక కేటాయింపుగా వున్న సబ్‌ప్లాన్ విధానాన్ని కొనసాగించడం అవశ్యం. కేంద్ర ప్రభుత్వం 1980వ దశకంలోనే చట్టపరంగా తీసుకొచ్చిన ఈ సబ్‌ప్లాన్ విధానం నయా ఉదారవాద ఆర్థిక విధానాలు వచ్చాక క్రమంగా నీరుగారుతూ వచ్చింది. రాష్ట్ర స్థాయిలో సబ్‌ప్లాన్ చట్టం చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఉద్యమం సాగిన ఫలితంగానే ప్రభుత్వం 2013లో చట్టం చేసింది. అయితే, దాని కాల పరిమితి పదేళ్లుగా నిర్ణయించడంతో రానున్న జనవరి 24వ తేదీతో గడువు ముగుస్తుంది. సబ్ ప్లాన్ చట్టాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని దళితులు, గిరిజనులు, వివిధ ప్రజా సంఘాలు ఆందోళన చేయవలసిరావడం విచారకరం. అట్టడుగు వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబుతున్న ప్రభుత్వం ఇలాంటి కీలకమైన అంశంపై మీనమేషాలు లెక్కించడం మాని కార్యాచరణకు ఉపక్రమించాలి.

నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్రంలో సబ్‌ప్లానును క్రమంగా నిర్వీర్యం చేస్తున్నారు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్‌ను తీసుకురావడమే పరమ తిరోగమన చర్య. అసలు ప్లానే లేకపోతే ఇక సబ్‌ప్లాన్ ఇంకెక్కడ అనే స్థితి తెచ్చారు. కాని దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం పెల్లుబకడంతో బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయింపులు చేస్తున్నారు. కాని, అదంతా ఖర్చు చేయకుండా కోతలు పెట్టడం, ఇంకొన్ని నిధులను దారి మళ్లించడం షరా మామూలే! కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలిస్తున్న మోడీ సర్కారు ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికి కనీస కేటాయింపులను కూడా ఖర్చు చేయకపోవడం సంఘపరివార్ నైజానికి నిదర్శనం. కాని, కేరళ లోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టిల జనాభా శాతం కన్నా ఎక్కువ శాతం నిధుల్ని ప్రణాళికా వ్యయంలో కేటాయించడం శ్లాఘనీయం. దేశంలో అలా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంకేదీ లేదు.

రాష్ట్రంలో సబ్‌ప్లాను చట్టం చేయడంతో నిధుల కేటాయింపు, ఖర్చునకు కొంత గ్యారంటీ వచ్చింది. కాని, 2018 నుండి రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు క్రమంగా తగ్గిస్తున్నారు. నిధుల మళ్లింపు యథేచ్ఛగా సాగిపోతోంది. జనాభా ప్రాతిపదికగా సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలి. ఆ ప్రకారం చూస్తే ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో 20 వేల కోట్ల రూపాయలు కేటాయించాలి కానీ అది కేవలం రూ.17,403 కోట్లు మాత్రమే. ఇందులోనూ ఎస్‌సి ఎస్‌టిల అభివృద్ధికి ఖర్చు చేసింది సుమారు ఐదు వేల కోట్లు మాత్రమేననీ మిగతా 12 వేల కోట్లను ఇతర పథకాలకు మళ్లించారన్న ఆరోపణ సత్య దూరం కాకపోవచ్చు. సబ్‌ప్లాన్ నిధులను ఆ తరగతులవారు నివసించే ప్రాంతాలు అంటే దళిత వాడలు, గిరిజన గూడేలు, తండాల అభివృద్ధికి, ప్రత్యేకించి మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయాలి. చట్టం స్పష్టంగా చెబుతున్నా, గతంలోనూ, ఇప్పుడూ ప్రభుత్వాలు ఆ రీతిలో ఖర్చు చేయడంలేదు. రోడ్లు వేయడానికి, సాగు నీటి ప్రాజెక్టులకూ సబ్ ప్లాన్ నిధులనే వాడేయడం దారుణం. ఎవరైనా ప్రశ్నిస్తే వారూ వాడుకుంటారు కదా అన్న ఏలినవారి సమాధానం పేదలను, సబ్‌ప్లాన్ చట్టాన్ని వెక్కిరించడమే! ఆయా తరగతుల అభివృద్ధికి ప్రత్యేకించి ఖర్చు చేయవలసిన నిధులను నవరత్నాల్లో భాగంగా సాధారణ పథకాలకు వెచ్చించడం ధర్మం కాదు.

ప్రభుత్వ రంగాన్ని పాలకులు క్రమంగా కుదించివేయడంతో సామాజిక న్యాయం చతికిలపడుతోంది. ఎస్‌సి, ఎస్‌టి లకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్ల కోసం ఉద్యమించవలసిన పరిస్థితి. అణగారిన వర్గాల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. కనుక ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు వెచ్చించేలా సబ్‌ప్లాన్ చట్టం కొనసాగాల్సిందే. కేటాయింపులు అణగారిన తరగతులవారి అభివృద్ధికి దోహదపడే విధంగా ఉండాలి. కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు మళ్లించే వీలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి. ఉల్లంఘించేవారిపై చర్యలు తీసుకోవాలి. ఇలాంటి న్యాయమైన డిమాండ్లతో వివిధ సామాజిక సంఘాలు, సంస్థలు విశాల ఐక్య ఉద్యమం సాగించాలి. దానికి అభివృద్ధి కాముకుల, ప్రగతిశీల శక్తుల మద్దతు తప్పక లభిస్తుంది. ప్రభుత్వాలు ప్రజా ఒత్తిడికి తలొగ్గక తప్పదు.

మంచి మాట

సంప్రదాయాలను ధిక్కరించి ముందుకు పోవడానికి అనేక ద్వారాలు అడ్డుగా వున్నాయి. అసంఖ్యాకమైన కావలిదార్లు పహారా కాస్తున్నారు.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

Rabindranath Tagore

విశ్లేషణ

హిందూత్వ-కార్పొరేట్ పాలనను ఐక్యంగా ఎదుర్కోవాలి

మరో రెండు రోజుల్లో ముగియనున్న 2022 సంవత్సరాన్ని ఒక్కసారి వెనక్కి తిరిగి సావధానంగా అవలోకించినట్టయితే ఒక విషయం బోధపడుతుంది. అంతకు ముందు రెండేళ్ళు 2020, 2021ల్లో తీవ్ర పతనంలో కూరుకుపోయి, దాన్నుండి బయటకు రావడానికి భారత ఆర్థిక వ్యవస్థ పోరాటం సాగించిన సంవత్సరం ఇది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పారిశ్రామిక ప్రతిష్టంభన, ఆదాయం, సంపదల్లో పెరుగుతున్న అసమానతలు... ఇవన్నీ కూడా ఈ ఏడాదిలో స్పష్టమైన అంశాలుగా కనిపిస్తున్నాయి.

ఏడాది ముగిసే సమయానికి, నిరుద్యోగుల సంఖ్య ఐదు కోట్లకు పైగా చేరుకుంది. ఏడాదిలో ఎక్కువ భాగం రిటైల్ ద్రవ్యోల్బణం 7 శాతానికి పైగా నమోదైంది. దీనికి తోడు పారిశ్రామిక ప్రగతిలో ప్రతిష్టంభన కూడా నమోదైంది. 2022 అక్టోబరులో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) అంతకుముందు ఏడాది అక్టోబరుతో పోలిస్తే 4 శాతం తక్కువగా వుంది.

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం చేపట్టిన డ్రైవ్ కొనసాగింది. జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసి ఐపిఒకు వెళ్ళడం ఇందులో ఒక ప్రధాన చర్యగా వుంది. ఈ చర్యతో అతి పెద్ద బీమా కంపెనీలో ప్రభుత్వ వాటా పలచబడిపోయింది. దేశంలో విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరించేందుకు బిల్లును కూడా ప్రభుత్వం తీసుకువచ్చింది. దీనివల్ల ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యుత్ పంపిణీ కంపెనీలు నాశనమవుతాయి. బడా కార్పొరేట్లకు బ్యాంక్ రుణాలు రద్దు చేయడమనే ప్రక్రియ కొనసాగింది. మొత్తంగా రూ.10.01 లక్షల కోట్ల మేరకు రుణాలను రద్దు చేశారు.

ప్రభుత్వం అనుసరించిన ఈ విధానాల ఫలితంగా, అసమానతలు మరింత పెరిగిపోయాయి. దేశంలో అగ్ర స్థానంలో వున్న ఒక శాతం మంది జనాభా వద్ద మొత్తంగా దేశ సంపదలో 40.6 శాతం సంపద పేరుకుపోయింది. 2000 సంవత్సరంలో ఇది 32 శాతంగా వుంది. 2022 సంవత్సరంలో గౌతమ్ అదానీ ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద సంపన్నుడుగా, ఆసియాలోనే అత్యంత సంపన్నుడుగా ఆవిర్భవించాడు. అభ్యంతరకరమైన స్థాయిలో సంపద పోగుపడడానికి స్పష్టమైన ఉదాహరణ ఇది. అదానీ మొత్తం ఆస్తుల నికర విలువ 13,300 కోట్ల డాలర్లుగా వుంది.



> భారత దేశానికి, భారత రాజకీయాలకు తిరిగి ఒక రూపునివ్వడానికి హిందూత్వ శక్తులు అదేపనిగా సాగించిన ప్రయత్నాలను కూడా ఈ సంవత్సరంలో చూశాం. కాశీవిశ్వనాథ్ కారిడార్ వంటి ఆలయ ఆవరణల పునరుద్ధరణ కార్యక్రమాలకు స్వయంగా ప్రధాని అధ్యక్షత వహించారు. వివిధ మత కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు. మొత్తంగా హిందువులందరినీ ఏకంగావించేందుకు చేసే ప్రయత్నాల కారణంగా ముస్లింలు దూరమవుతున్నారు. శ్రీరామనవమి, కొత్తగా తలెత్తిన హనుమాన్ జయంతి ప్రదర్శనలు వంటి మతపరమైన పండుగల సందర్భంగా...మైనారిటీలను లక్ష్యంగా చేసుకునేందుకు నిరంతరంగా ప్రయత్నాలు సాగుతూనే వున్నాయి. ఈ దాడులకు వ్యతిరేకంగా ముస్లింలు సాగించే ఏ నిరసనలైనా వారిని అరెస్టు చేయడానికి దారి తీస్తున్నాయి.

భారత దేశానికి, భారత రాజకీయాలకు తిరిగి ఒక రూపునివ్వడానికి హిందూత్వ శక్తులు అదేపనిగా సాగించిన ప్రయత్నాలను కూడా ఈ సంవత్సరంలో చూశాం. కాశీ విశ్వనాథ్ కారిడార్ వంటి ఆలయ ఆవరణల పునరుద్ధరణ కార్యక్రమాలకు స్వయంగా ప్రధాని అధ్యక్షత వహించారు. వివిధ మత కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు. మొత్తంగా హిందువులందరినీ ఏకంగావించేందుకు చేసే ప్రయత్నాల కారణంగా ముస్లింలు దూరమవుతున్నారు. శ్రీరామనవమి, కొత్తగా తలెత్తిన హనుమాన్ జయంతి ప్రదర్శనలు వంటి మతపరమైన పండుగల సందర్భంగా...మైనారిటీలను లక్ష్యంగా చేసుకునేందుకు నిరంతరంగా ప్రయత్నాలు సాగుతూనే వున్నాయి. ఈ దాడులకు వ్యతిరేకంగా ముస్లింలు సాగించే ఏ నిరసనలైనా వారిని అరెస్టు చేయడానికి దారి తీస్తున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో జరిగిన తరహాలో వారి ఇళ్ళు నేలమట్టం చేయబడుతున్నాయి.

'నూతన భారతదేశం' అన్న ఆలోచనను తెరపైకి తీసుకు వచ్చేందుకు భారత్ 75వ స్వాతంత్ర్య దినోత్సవాలను ఉపయోగించుకున్నారు. ఇక్కడ నూతన భారతదేశం అంటే 'హిందూ మెజారిటీవాద దేశం' అన్న ఆలోచన తప్ప మరొకటి కాదు. "శతాబ్దాల తరబడి విదేశీ దాడులు" నుండి స్వేచ్ఛ, "వలసవాద దృక్పథం" నుండి విముక్తి గురించి వారు మాట్లాడుతుంటారు. అంటే దానర్థం శతాబ్దాల తరబడి ముస్లింల పాలన నుండి విముక్తి గురించే వారు మాట్లాడుతున్నారు. అలాగే వలసవాద దృక్పథం అంటే బ్రిటీష్ పాలనా కాలానికి సంబంధించి కాదు, ముస్లిం పాలకుల కాలానికి సంబంధించినది.

దేశాన్ని లౌకికవాద భావనలకు దూరంగా తీసుకెళ్ళడం (డీ సెక్యులరైజ్)తో పాటూ సమాఖ్యవాదంపై, రాష్ట్రాల హక్కులపై దాడులు కూడా ఈ ఏడాదిలో ఉధృతమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వాల పరిధి లోకి వచ్చే విషయాల్లో జోక్యం చేసుకోవడానికి బిజెపి యేతర పాలిత రాష్ట్రాల గవర్నర్లను దారుణంగా ఉపయోగించుకున్నారు. వైస్ ఛాన్సలర్లుగా తమకు ఇష్టమైన వారిని నియమించుకోవడానికి, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ పదవిని ఉపయోగించుకున్నారు. నిధులను రుణంగా తీసుకునే హక్కులో తమ వాటా వనరులు రాష్ట్రాలకు రాకుండా చేయడానికి కేంద్రం కొత్త మార్గాలను రూపొందించింది.

ఎన్నికల కమిషన్‌ను, ఇతర సంస్థలను మచ్చిక చేసుకున్న తర్వాత...2022లో చివరి రెండు మాసాలు ఉన్నత న్యాయ వ్యవస్థపై సంఘటిత దాడులను చవి చూశాయి. స్వయాన మంత్రే ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. వ్యక్తిగత స్వేచ్ఛలను, పౌరుల హక్కులను కాపాడుతూ సుప్రీంకోర్టు తీసుకున్న వైఖరి నిరంకుశ పాలకులకు ఆగ్రహం తెప్పించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగంగా అసమ్మతి వెలిబుచ్చిన వారి లేదా హిందూత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడిన వారి పౌర స్వేచ్ఛలను, ప్రజాస్వామిక హక్కులను నియంతృత్వ పాలకులు కాలరాస్తూనే వచ్చారు.

ఏడు రాష్ట్రాల - ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్- అసెంబ్లీలకు ఈ ఏడాది ఎన్నికలు జరిగాయి. మొత్తంగా ఏడు రాష్ట్రాల అసెంబ్లీలకు గానూ ఐదింటిలో బిజెపి గెలుపొందింది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో పరాజయాన్ని చవి చూసింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా ఓటమిని మూటగట్టుకుంది. ఉత్తరప్రదేశ్, గుజరాత్ ఎన్నికలు ఒక హెచ్చరికను చేశాయి. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, దారిద్ర్యంతో ప్రజల్లో తీవ్రంగా అసమ్మతి నెలకొన్నప్పటికీ, ఎన్నికల పరంగా బిజెపి ఈ సమస్యలన్నింటినీ అధిగమించడానికి...తీవ్రంగా పదును తేలుతున్న మతోన్మాద ధోరణులు, పాన్ హిందూ ఏకీకరణ ప్రయత్నాలు దోహదపడతాయి.

ప్రజల జీవనోపాధుల రక్షణ కోసం సాగే పోరాటాలు, ప్రైవేటీకరణకు, కార్మిక వర్గానికి వ్యతిరేకంగా సాగే పోరాటాలు, రైతాంగ వ్యతిరేక విధానాలు, హిందూత్వ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సాగే సంఘటిత ప్రచారాలు వీటన్నింటినీ మిళితం చేసి పోరాడాల్సిన ఆవశ్యకతను ఇది నొక్కి చెబుతోంది. కార్మిక వర్గం, ఇతర వర్గాల ప్రజల నుండి పెరిగిన ప్రతిఘటనను ఈ ఏడాది చవి చూసింది. మార్చి 28-29 తేదీల్లో కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన రెండు రోజుల సార్వత్రిక సమ్మె ఘన విజయాన్ని సాధించింది. సమ్మె కార్యాచరణలో అధిక సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు. స్వామినాథన్ కమిషన్ ఫార్ములా (సి2 ప్లస్ 50 శాతం) ప్రాతిపదికన చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కోసం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) తన పోరాటాన్ని కొనసాగిస్తోంది. కరోనా మహమ్మారితో ఇబ్బందులు, అవరోధాలు ఎదుర్కొన్న తర్వాత... విద్యా రంగంపై ఇతర దాడులకు, నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సుదీర్ఘమైన పోరాటానికి సమాయత్తమవుతున్నారు.

దేశవ్యాప్తంగా సాగే పోరాటాలకు సంబంధించిన కీలక సమస్యల్లో విద్యుత్ (సవరణ) బిల్లు ఒకటి. ఈ బిల్లును ఆమోదించినట్లైతే, రైతులతో సహా సామాన్యులకు, లక్షలాది మంది కార్మికులకు, విద్యుత్ రంగంలోని ఇంజనీర్లకు పెద్ద సమస్యగా మారుతుంది.

లోక్‌సభ ఎన్నికలు 2024లో జరగనున్నందున 2023 సంవత్సరం చాలా కీలకమైనది. ఈ సంవత్సరం ప్రజా సమస్యలపై పోరాడేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికవాద శక్తులు తమ వనరులన్నింటినీ సమీకరించుకుని, హిందూత్వ-కార్పొరేట్ ప్రభుత్వ రాజకీయ, సైద్ధాంతిక దాడులను సమైక్యంగా ఎదుర్కొనాల్సిన సంవత్సరంగా వుండాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★

సమస్య

విద్య ప్రైవేటీకరణ వద్దు

విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వస్తున్నామని వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చెబుతున్నప్పటికీ విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించేలా సంస్కరణలు చేపడుతున్నది. 'నాడు-నేడు'తో పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం మంచిదే. కాని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన తరువాత అన్ని రూ. కోట్లు ఖర్చు పెట్టి ఏం ఉపయోగం? విశాలంగా ఉన్న ప్రైమరీ పాఠశాలల్లో పిల్లలు లేరు. ఉన్నత పాఠశాలల్లో పిల్లలు నేలపై కూర్చుని చదువుతున్నారు. పోనీ ఈ విలీనం వలన మంచి ఫలితాలు వచ్చాయా అంటే అదీ లేదు. 2021-22 విద్యా సంవత్సరంలో 44,29,356 మంది చదివితే 2022-23 విద్యా సంవత్సరంలో 40,31,239 మంది చదువుతున్నారు. అంటే 3,98,117 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. చాలా మంది చదువుకు దూరమయ్యారు. భవిష్యత్తులో 3 కి.మీ దూరంలో ఉన్న పాఠశాలలు కూడా విలీనం అయితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది.

మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ ఆన్‌లైన్ లోనే ఉన్నాయంటూ బైజూస్‌లో క్లాసులు నేర్చుకోమంటున్నది. వాట్సప్‌లో పరిక్ష పేపర్లు రిలీజ్ చేస్తుంది. చివరకి అటెండెన్స్ కూడా అన్‌లైన్ లోనే వెయ్యాలంటుంది. బైజూస్ క్లాసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.688 కోట్లు ఖర్చుపెట్టి 4,59,564 మంది విద్యార్థులకు 59,176 మంది ఉపాధ్యాయులకు ట్యాబులు అందించామంటుంది. మరోపక్క రూ.25,000 కంటే తక్కువ ఆదాయ వనరులు ఉన్న వారికి ట్యూషన్లు చెప్పమని ఎడ్ టెక్ సంస్థ చెప్తుంది. తమ కోర్సులను కొనాలని లేకుంటే మీ పిల్లల భవిష్యత్తు నష్టపోతారని బైజూస్ తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఆన్‌లైన్ విద్యను ప్రోత్సహించాలంటున్న ప్రభుత్వం ఆన్‌లైన్ సదుపాయం లేని వారికి ఆఫ్‌లైన్‌లో కూడా మెటీరియల్ అందుబాటులో ఉంటుందని నమ్మబలుకుతున్నది. ఆఫ్‌లైన్‌లో మెటీరియల్ ఉన్నప్పుడు అది ఆన్‌లైన్ విద్య ఎలా అవుతుంది? ఆన్‌లైన్ చదువుల కోసం ఇన్ని కోట్లు ఖర్చు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష పేపర్లను ప్రింట్ చేసి విద్యార్థులకు ఇవ్వకుండా అందులోనూ మిగుల్చుకోవాలనుకుంటున్నది. వాట్సప్‌లో ప్రశ్నాపత్రాన్ని రెండు గంటల ముందు పంపిస్తుంది. ఆ ప్రశ్నా పత్రం రాయడానికే విద్యార్థికి గంట పడుతున్నప్పుడు ఇంక సమాధానాలెప్పుడు రాస్తాడు? ఇది కేవలం విద్యను ప్రైవేటీకరిస్తూ బైజూస్, సామ్‌సంగ్ వంటి కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టడం కోసమే తప్ప మరొకటి కాదు.

ముఖ్యమంత్రి గారు పాదయాత్ర సమయంలో ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తయారు చేస్తామంటే ఏంటో అనుకున్నాం. కానీ అది ఫీజుల విషయంలోనని ఇప్పుడు అర్థమవుతోంది. ఇంటర్మీడియట్ పరిక్ష ఫీజుల వివరాలు రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. పరిక్ష ఫీజు రూ. 510. కానీ 18 రోజుల వ్యవధి లోనే అపరాధ రుసుమును రూ.120 నుండి రూ.5,000 వరకు విధించింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఫీజులు గతంలో రూ. 2500 ఉంటే ఈ విద్యాసంవత్సరం రూ.8090 నుండి రూ.9980 వరకు పెంచింది. కరోనాతో ఆర్థికంగా చితికిపోయిన తల్లిదండ్రులపై ఫీజుల భారం పెద్ద గుదిబండగా మారింది. అయినా రూ.9980 కట్టుకునే స్తోమత ఉన్న వాళ్లు ఇంకో రూ.2000 అప్పు చేసి అన్ని సదుపాయాలు, అధ్యాపకులు ఉన్న ప్రైవేట్ కాలేజీల్లో చేరతారు కానీ ఏ సదుపాయాలు, అధ్యాపకులు లేని ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎందుకు చేరుతారనే సందేహం కలుగుతుంది. అదే వాస్తవం. ప్రభుత్వానికి కావాల్సింది కూడా అదే. అందుకే ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు చేరలేదనే నెపంతో 254 కోర్సులను మూసివేసింది. కొత్తగా ఎఫ్.ఆర్.ఎస్ తీసుకువచ్చింది. విద్యా దీవెన, వసతి దీవెనలో కోత విధిస్తున్నది. ఎఫ్.ఆర్.ఎస్ తీసుకురావడంతో కాలేజీలకు విద్యార్థులు వస్తున్నారు. కానీ అధ్యాపకులు లేకపోవడం వలన కనీసం వారికి పాఠ్యాంశాల పేర్లు కూడా తెలియడం లేదు. ఏంటి ఉపయోగం? ఈ రకంగా మొత్తం విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేసే విధంగా సంస్కరణలు చేస్తున్నది. నూతన విద్యా విధానాన్ని, ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొడదాం. భవిష్యత్తు తరాలకు ఉచిత విద్యను అందిద్దాం.

- డి.రాము,
ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా సహాయ కార్యదర్శి.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఏం జరుగుతుందో బిగ్గరగా చెప్పడమే ఎవరైనా, ఎప్పుడైనా చేయగల అత్యంత విప్లవాత్మకమైన పని.
- రోజా లగ్జంబర్గ్,
మార్క్సిస్టు సిద్ధాంత కర్త.

కామన్‌సెన్స్

యధార్థవాది శ్రేయోభిలాషి ... అబద్ధాలకోరు లోకవిరోధి ...

డా॥ దేవరాజు మహారాజు

పోరాట యోధులకు, దేశ ద్రోహులకు తేడా ఈ విధంగా ఉంటుంది. భగత్‌సింగ్ బ్రిటిష్‌వారిపై తిరుగుబాటు చేసినందుకు ఇరవైమూడేళ్ల వయసులో ఉరిశిక్షకు గురయ్యాడు. చంద్రశేఖర్ ఆజాద్ కూడా బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసినవాడే. కాని, శత్రువుల చేతిలో చనిపోవడం ఇష్టం లేక ఇరవై అయిదేళ్ల వయస్సులో పిస్తోలు తన కణతలకు గురిపెట్టి కాల్చుకున్నాడు. పోరాట యోధులకు, ఉద్యమకారులకు ఎప్పటికీ వీరు స్ఫూర్తిదాయకులే. ఇక సావర్కర్ ఏం చేశాడన్నది ప్రపంచానికి తెలుసు. క్షమాభిక్ష పిటిషన్లు రాసి రాసి, బ్రిటిష్ వారికి లొంగిపోయినవాడు సావర్కర్. ఇక ఆ రోజుల్లో మహ్మదాలీ జిన్నాతో చేతులు కలిపి, స్వాతంత్ర్యోద్యమాన్ని నీరుగార్చడానికి బ్రిటిష్ వారికి సహకరించినవాడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ! యోధులకు, ద్రోహులకు తేడా తెలుసుకోవాలంటే, ఈ నలుగురి జీవిత చరిత్రలు తెలుసుకుంటే చాలు!

ఇక గోల్వాల్కర్ ఏమన్నాడో చూడండి. "హిందూస్తాన్‌లో ఉన్న విదేశీ జాతుల వారంతా హిందూ సంస్కృతి, భాషను అవలంభించాలి! హిందూ మతం పట్ల గొప్ప భక్తి శ్రద్ధలను కలిగి ఉండాలి. దాన్ని గౌరవించడం నేర్చుకోవాలి. హిందూ జాతిని కీర్తించడం తప్ప, వారు మరొక భావజాలాన్ని కలిగి ఉండకూడదు. వారు, వారి ప్రత్యేకమైన ఉనికిని వదులుకుని, హిందూ జాతిలో కలిసిపోవాలి. లేదా దేశంలో ఉంటే హిందూ జాతికి పూర్తి బానిసలుగా ఉండాలి. దేనినీ తమదిగా ప్రకటించుకోరాదు. వారికి ఇక్కడ ఎటువంటి సౌకర్యాలూ ఉండగూడదు. పౌర హక్కులు సైతం ఉండగూడదు" అని 'అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' అనే గ్రంథంలో స్పష్టంగా రాశారు గోల్వాల్కర్. ఈయన ఆర్‌ఎస్‌ఎస్‌కు రెండో గురువు. ఆరెస్సెస్ స్థాపించింది హెడ్గేవార్ అయినప్పటికీ, గోల్వాల్కర్ నేతృత్వంలోనే ఆరెస్సెస్ భావజాలం బాగా వ్యాప్తి చెందింది.

ఆ రోజుల్లో జర్మన్ జాతి ప్రతిష్ట విశ్వవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వారు తమ జాతి స్వచ్ఛతను, సంస్కృతినీ కాపాడుకోవడానికి - తమ దేశాన్ని యూదులు లేని దేశంగా (సెమిటిక్) శుభ్రపరుచుకోవాలని అనుకున్నారు. దీనినే ఆరెస్సెస్ వారు ఇక్కడ భారతదేశంలో అమలు చేయాలనుకున్నారు. యూదులపై హత్యాకాండ జరిపించిన హిట్లర్‌ను, జర్మనీని గోల్వాల్కర్ కీర్తించాడు. ప్రపంచమంతా జర్మనీని ఫాసిస్ట్ దేశంగా, హిట్లర్‌ను ఫాసిస్ట్ నియంతగా తిట్టిపోస్తుంటే... ఇక్కడ గోల్వాల్కర్ మాత్రం - యూదు జాతి లేకుండా జర్మనీ తనను తాను శుభ్రపరచుకుందని కీర్తించాడు. ఆ విధంగా ఆ దేశం కల్తీ లేని స్వచ్ఛమైన జాతిగా ఆవిర్భవించిందని ప్రశంసించాడు. అదే జర్మనీ ఫార్ములాను భారతదేశంలో అమలు చేయాలని కలలు గన్నాడు. భారతదేశంలో స్వచ్ఛమైన హిందూ జాతిని మాత్రమే మిగుల్చుకుని, మిగతా వారిని ఇక్కడి నుండి తరిమేయాలని పథకాలు, కుట్రలు సిద్ధం చేసుకున్నాడు. గోల్వాల్కర్ వారసులు 2002లో గుజరాత్‌లో సృష్టించిన అల్లర్లను తాజాగా గుర్తుచేసుకోవచ్చు. గోద్రాలో రైలు తగలబెట్టి, వేల మంది మరణానికి కారణమైన ఆ నేరమేధాన్ని ఎలా మరవగలం? గుజరాత్‌లో ముస్లింలపై సాగించిన హత్యాకాండ, వేల మందిని గాయాల పాలు చేసిన వికృత చేష్ట ఆరెస్సెస్ వారిదే కదా? వారి భావజాలానికి గుజరాత్‌ను ఒక ప్రయోగశాలగా చేసుకున్నారు.



మతోన్మాద ఆరెస్సెస్ - బీజేపీలు ఒకప్పటి ఫాసిస్టు జర్మనీని ఇప్పటికీ అనుసరిస్తున్నాయి. కానీ అధిక సంఖ్యాకులైన ఈ దేశ ప్రజల అభిప్రాయం అందుకు భిన్నంగా ఉంది. మరీ ముఖ్యంగా సమకాలీన భారతదేశపు యువతీ యువకుల అభిప్రాయం లౌకిక తత్త్వం వైపు ఉంది. ఎందుకంటే ఈ భారతదేశం ఒక లౌకికదేశం. ఇక్కడ లౌకికవాదులే ఉండాలని యువతరం ఆశిస్తోంది.

"ఆరెస్సెస్ - విశ్వహిందూ పరిషత్ పుట్టుకొచ్చి కనీసం వందేళ్లయినా కూడా కాలేదు. మరి అంతకు ముందు దేశంలో హిందువులు లేరా?" అని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ ప్రశ్నించారు. "ఆరెస్సెస్ హిందుత్వ ఎక్కడి నుండి వచ్చింది? వారు ఆరాధించే దేవుడూ - దేవతా ఎవరూ?" అని నిలదీశారు. హింస, గుండాగిరి, మన దేశ సంస్కృతి కాదని చెపుతూ మహాత్మాగాంధీని పొట్టన పెట్టుకుంది ఆ సంస్థేనని గుర్తుచేశారు. "మనుషుల్ని జంతువుల కన్నా హీనంగా చూసేవారు ఈ సంస్థ సభ్యులే" అని దుయ్యబట్టారు. ఆయన అన్నదాంట్లో అబద్ధాలేమీ లేవు. యధార్థవాది లోకవిరోధి - అనే మాటను మార్చుకోవాల్సి ఉంది. యధార్థవాదే లోకానికి శ్రేయోభిలాషి. అబద్ధాలు చెప్పేవాడే లోకవిరోధి. అంటే లోకానికి కీడు చేసేవాడు. ఉదాహరణకు మాతా కల్కి శివజ్యోతి ప్రకటనను గమనించండి. ఆరెస్సెస్ - బీజేపీ నాయకులు వారి అనుయాయులు జనాన్ని ఎలా రెచ్చగొట్టగలరో ప్రతి నిత్యం మీడియాలో చూస్తున్నాం. "ఒక అమ్మాయి రేప్‌కు గురయ్యిందంటే, అది ఆమె ఖర్మ ఫలితం! గత జన్మలో ఆమె పురుషుడిగా ఉన్నప్పుడు అన్యాయంగా అక్రమంగా ఏ అమ్మాయినో రేప్ చేసి ఉంటుంది. దాని ఫలితమే ఇప్పుడు ఈ జన్మలో అనుభవిస్తుంది" అనే ఒక తుక్కు సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. అయితే దైవభక్తి పరులే ఇంతటి మూర్ఖ జ్ఞానాన్ని జనానికి ప్రసాదించగలరు.

విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్‌లకు మన భారతీయ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా లేఖ రాశాడు... "నేను ప్రభుత్వాన్ని విమర్శిస్తే మీ మనోభావాలు దెబ్బతింటాయి. మీరు నిజంగా భరతమాత బిడ్డలయితే "గాడ్సే ముర్దాబాద్" అని నినదించండి చూద్దాం! అలా చేయలేకపోతే మీరు హిందూ వ్యతిరేకులుగా, ఉగ్రవాదులుగా పరిగణింపబడతారు. ఇలాంటి పరిస్థితిని గమనించే ఉర్దూ కవి అక్బర్ అలహాబాదీ అంటారు... "ఆహ్ భి కర్‌తే హై / తొ హో జాతే హై బద్‌నామ్ / ఓ కత్ల్ భి కర్‌తా హై / తొ చర్చా నహీ హోతీ" అని. మేం వేదన ప్రకటిస్తేనే - నిందకు గురి అవుతాం- అదేమిటో వాడు హత్య చేసినా అది చర్చకే రాదు అన్నది ఆ చరణాల సారాంశం. అధికారాన్ని దుర్వినియోగం చేసేవారు ఉన్నంత కాలం, నిజాయితీ పరులైన సామాన్య జనానికి బాధలు తప్పవు.

హిజాబ్ (తలపై కప్పుకునే గుడ్డ) ధరించడం, ధరించకపోవడం ఆయా మహిళల ఇష్టం. ఇరాన్‌లో హిజాబ్ వద్దంటున్నారు. మన కర్నాటక రాష్ట్రంలో హిజాబ్ కావాలంటున్నారు. అది వేసుకునే వారి ఇష్టం. దేశ ప్రధాని మోడీతో పాటు, ఆయన అనుచర గణమంతా నగ్న స్వాముల ముందు సాగిలపడుతుంటారు. వీరికి డ్రెస్ కోడ్ వర్తించదా?

కర్ణాటక లోని బిజేపీ ప్రభుత్వం 8వ తరగతి పాఠ్యపుస్తకంలో ఒక అసంబద్ధమైన అంశం ప్రచురించింది. పిల్లలకు బోధిస్తున్నారు. విషయం ఏమిటంటే సావర్కర్ అండమాన్ సెల్యులార్ జైలులో ఉండగా మాతృభూమిని చూడాలని అనిపించినప్పుడల్లా అక్కడ ఉండే బుల్‌బుల్ పక్షుల రెక్కల మీద కూర్చుని భారతదేశం వచ్చేవాడట. దేశాన్ని కళ్ళారా చూసుకుని మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయేవాడట. చరిత్రను పురాణంగా, పురాణాన్ని చరిత్రగా మలిచే తెలివితేటలు అదేమిటో ఆరెస్సెస్ బీజేపీలకే ఉంటాయి. ఆ పాఠం చదువుకుంటున్న బాలబాలికల పరిస్థితి ఏమిటీ? రేపు వారు నిజం తెలుసుకుని... కల్పించిన అబద్ధాలను పాఠ్యాంశాలుగా ఎందుకు పెట్టారని నిలదీస్తే ప్రభుత్వ పెద్దలు ఎక్కడ దాక్కుంటారు? అయినా జైలు నుండి బయటపడి పక్షిరెక్కల మీద ఇండియా రాగలిగినవాడు ఇక్కడే ఉండిపోవచ్చుగదా? క్షమాపణలు కోరుతూ బ్రిటిష్‌వారి కాళ్ళమీద ఎందుకు పడ్డాడూ?

అయినా వారిని అని ఏం లాభం? సంసారం ఎలా నడపాలో సన్యాసిని అడుగుతున్నాం మనం!

/వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త/

నోట్ల రద్దుపై మోడీ సర్కార్ దొంగాట

- ఆర్‌బిఐ వద్దన్నా.. ప్రభుత్వమే ఏకపక్షంగా నిర్ణయం
- రెండున్నర గంటల ముందే మమ అనిపించిన ఆర్‌బిఐ
- అఫిడవిట్‌లో భిన్న అంశాలు

హైదరాబాద్ : భారత రిజర్వుబ్యాంకు(ఆర్‌బిఐ)తో సంప్రదింపులు చేశాకే నోట్ల రద్దు ప్రక్రియను చేపట్టామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. నోట్ల రద్దుపై అనేక పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టు జనవరి 2న తీర్పును వెలువరించనుంది. 2016 నవంబర్ 8న ప్రధాని నరేంద్ర మోడీ రూ.500, రూ.1000 నోట్ల రద్దును ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి ముందే 2016 ఫిబ్రవరి నుంచే ఆర్‌బిఐతో సంప్రదింపులు జరిగాయని కేంద్రం తెలిపింది. ఆర్‌బిఐ కూడా తన అఫిడవిట్‌లో తగిన ప్రక్రియను అనుసరించినట్లు, తానే నోట్ల రద్దుకు సిఫార్సు చేసినట్లు పేర్కొంది. ప్రభుత్వం, ఆర్‌బిఐ అఫిడవిట్‌లో ప్రస్తావించని పలు అంశాలను ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ గుర్తించింది. నోట్ల రద్దు, ప్రభుత్వ సమర్థనలపై ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డు పలు విమర్శలు చేసిన తర్వాత కూడా కేంద్రం ముందుకు సాగింది. ముఖ్యంగా నోట్ల రద్దుపై ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డు అభ్యంతరాలు, ప్రతిపాదనలను కేంద్రం, ఆర్‌బిఐ తమ తుది అఫిడవిట్‌లో పేర్కొనలేదు. ప్రభుత్వ అఫిడవిట్‌లోని అనేక అంశాలను ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డు ముందే తోసిపుచ్చడం విశేషం. ఆ వివరాలు..

అఫిడవిట్‌లలోని కొన్ని ప్రధానాంశాలు..

1. జిడిపిలో కరెన్సీ సరఫరా : పెద్ద నోట్ల రద్దును సమర్థించడానికి జిడిపిలో కరెన్సీ సరఫరా (కరెన్సీ ఇన్ సర్క్యులేషన్ - సిఐసి) ఒక కీలకమైన గణాంకం. "చలామణిలో ఉన్న నగదు పరిమాణం నేరుగా అవినీతి స్థాయికి ముడిపడి ఉంది" అని 2016 నవంబర్ 8న ప్రధాని మోడీ తన ప్రసంగంలో అన్నారు. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో అంటే.. 2011-12 నుంచి 2015-16 జిడిపిలో సిఐసి 11 శాతం పైగా నిష్పత్తి కలిగి ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. ఇది అమెరికాలోని 7.74 శాతం కంటే చాలా ఎక్కువ.

అఫిడవిట్‌లో చేర్చనిది : మూడేళ్లలోనే తిరిగి జిడిపిలో నగదు సరఫరా యథాతథ స్థాయికి చేరిన విషయాన్ని ఆర్‌బిఐ తన 2019-20 రిపోర్టులో పేర్కొంది. నోట్ల రద్దుకు ముందు జిడిపిలో 12.0 శాతంగా ఉన్న నగదు సరఫరా.. 2019-20 నాటికి తిరిగి 11.3 శాతానికి ఎగిసింది. ఇది 2020-21 నాటికి ఏకంగా 14.4 శాతంగా నమోదయ్యింది. తిరిగి 2021-22లో స్వల్పంగా తగ్గి 13.7 శాతంగా చోటు చేసుకుందని ఆర్‌బిఐ గణంకాలు చెబుతున్నాయి.

2. రూ.500, రూ.1000 నోట్ల పెరుగుదల : నోట్ల రద్దుకు ముందు ఐదేళ్లలో రూ.500, రూ.1000 నోట్ల చలామణీ భారీగా పెరిగింది. రూ.500 చలామణీ 76.38 శాతం, రూ.1,000 నోట్ల చలామణీ 108.98 శాతం పెరిగిందని ప్రభుత్వ అఫిడవిట్‌లో పేర్కొంది. ఆర్థిక వ్యవస్థలో ఈ నోట్లు ఊహించని విధంగా పెరిగాయి. మొత్తం ఆర్థిక వ్యవస్థ పరిమాణంలో పెరుగుదలతో పోలిస్తే పెద్ద నోట్ల సరఫరా వివరించలేనిది.

అఫిడవిట్‌లో చేర్చనిది : ప్రభుత్వ ఈ విశ్లేషణలోని లోపాన్ని ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డ్ ఎత్తి చూపింది. "ఆర్థిక వ్యవస్థ వద్ధి రేటు నిజమైన రేటు అయితే చెలామణిలో కరెన్సీ వృద్ధి నామమాత్రంగా ఉంది. ద్రవ్యోల్బణం కోసం నగదు సరఫరాను సర్దుబాటు చేస్తే వ్యత్యాసం అంత స్పష్టంగా ఉండకపోవచ్చు. అందువల్ల నోట్ల రద్దు వాదన సిఫారసుకు తగినంతగా మద్దతు ఇవ్వదు. ప్రధాని నోట్ల రద్దును ప్రకటించడానికి కేవలం రెండున్నర గంటల ముందు మాత్రమే సాయంత్రం 5.30 గంటలకు ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డు మీటింగ్ జరిగిందని మినెట్స్‌లో ఉంది.

3. నకిలీ కరెన్సీ పరిమాణం.

ప్రభుత్వ అఫిడవిట్ ప్రకారం.. భారత వ్యవస్థలోని నకిలీ కరెన్సీ నోట్లు గడిచిన ఒక్క ఏడాదిలోనే తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపాయి.

ప్రస్తావించని అంశం : "నకిలీకి సంబంధించిన ఏవైనా సంఘటనలు ఆందోళన కలిగిస్తాయి. చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీ (రూ.17 లక్షల కోట్లు పైగా) పరిమాణంలో రూ.400 కోట్లు నగదు మాత్రమే నకిలీ." అని ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డ్ మీటింగ్ యొక్క మినిట్స్ పేర్కొంది.

4. నల్లధనం నిల్వకు రూ.500, రూ.1,000 నోట్లను ఉపయోగించడం : నల్లధనం నిల్వకు రూ.500, రూ.1,000 నోట్లను అధికంగా ఉపయోగించడం ఒక్కటి. రెండో అంశం.. అధిక విలువ కలిగిన నోట్ల రూపంలో లెక్కలోకి రాని సంపదను నిల్వ చేయడం మరో దుర్మార్గం".

ప్రస్తావించనిది : ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డ్ ఈ వాదనను తోసిపుచ్చింది. "నల్లధనంలో ఎక్కువ భాగం నగదు రూపంలో కాకుండా బంగారం లేదా రియల్ ఎస్టేట్ వంటి రియల్ సెక్టార్ ఆస్తుల రూపంలో ఉంది. నోట్ల రద్దు ఆ ఆస్తులపై భౌతిక ప్రభావాన్ని చూపదు" అని పేర్కొన్నట్లు ఆర్‌బిఐ మినెట్స్‌లో ఉంది.

5. టెర్రరిజం కోసం నకిలీ కరెన్సీ : అఫిడవిట్ ప్రకారం.. టెర్రరిజం, ఇతర విధ్వంసకర కార్యకలాపాలకు నకిలీ కరెన్సీని ఉపయోగించుకోవడం మూడో అపరాధం.

ప్రస్తావించనిది : నకిలీ కరెన్సీ లేదా అధిక విలువ కలిగిన నోట్ల అంశం తీవ్రవాదానికి ఉపయోగపడుతున్నాయనేది ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డు మీటింగ్ మినిట్స్‌లో ఎలాంటి ప్రస్తావన లేదు.

6. కరెన్సీ నోట్లలో మార్పు : ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఏ సందర్భంలోనైనా కొత్త కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టే ప్రక్రియలో ఆర్‌బిఐ ఉంది. ఆ సమయం నుండి ప్రయోజనం పొందేందుకు మాత్రమే నోట్ల రద్దు నిర్ణయం ప్రయత్నించిందని పేర్కొంది. ఆర్‌బిఐ ప్రభుత్వంతో సంప్రదించి, జనవరి 2014 నుండి కొత్త సిరీస్‌పై కసరత్తు చేస్తోంది.

జనవరి 2న సుప్రీంకోర్టు తీర్పు..

నోట్ల రద్దుపై దాఖలైన పిటీషన్లపై సుప్రీంకోర్టు జనవరి 2న తుది తీర్పును వెల్లడించనుంది. న్యాయమూర్తులు ఎస్ అబ్దుల్ నజీర్, బిఆర్ గవాయి, ఎఎస్ బోపన్న, వి రామ సుబ్రమణ్యన్, బివి నాగరత్నలతో కూడిన ధర్మాసనం దీన్ని విచారిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ 2016 నవంబర్‌లో ప్రకటించిన నోట్ల రద్దును సవాల్ చేస్తూ దాదాపు 50 పిటిషన్లు నమోదయ్యాయి. ఐదుగురు సభ్యులతో కూడిన ఈ బెంచ్‌లోని న్యాయమూర్తి గవాయి తీర్పును ప్రకటించనున్నారు. దీనిపై డిసెంబర్ 7న తీర్పును రిజర్వు చేశారు. ఈ కేసులో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐ తన వాదనలను అఫిడవిట్ల రూపంలో అందజేశాయి.

"రూ. 500, రూ.1000 నోట్ల రద్దు ద్వారా నకిలీ, తీవ్రవాద ఫైనాన్సింగ్, నల్లధనం వంటి మూడు సమస్యలను పరిష్కరించడానికి కొత్త సిరీస్ నోట్లను ప్రవేశపెట్టడం చాలా అరుదైన, లోతైన అవకాశాన్ని అందించగలదని భారత ప్రభుత్వం, ఆర్‌బిఐ భావించాయని అఫిడవిట్‌లో పేర్కొంది. ఎంజి కొత్త సిరీస్ నోట్లను ప్రవేశ పెట్టడంతో పాటు ఇటువంటి నోట్ల రద్దు ప్రతిపాదన (డీమోనిటైజేషన్) మరింత అనుకూలమైన సమయంలో యాదృచ్ఛికంగా వచ్చిందని అఫిడవిట్ తెలిపింది.

ఇది పేర్కొనలేదు : రిజర్వ్ బ్యాంక్ బోర్డు మినెట్స్‌లో అటువంటి అనుకూల, యాదృచ్ఛిక సమయం గురించి ప్రస్తావించలేదు. నోట్ల రద్దు తర్వాత వారం అనంతరం నవంబర్ 14న ఎటిఎంల్లో నోట్ల జమకు సంబంధించిన టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. అదే విధంగా పాత శ్రేణీ నోట్లను కొత్త వాటితో మార్చుకోవడానికి ఆర్‌బిఐ యొక్క సన్నాహాలను సద్వినియోగం చేసుకుంటూ పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నట్లయితే.. రీమోనిటైజేషన్ (తిరిగి నగదీకరణ) ఎందుకు అనేక సమస్యలలో కూరుకుపోయిందనేది కీలక విమర్శ.

జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న బిసి నేతలు

చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి
- జంతర్ మంతర్‌లో బిసి నేతల మహాధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో బిసి బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ ఎంపి, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని కోరారు. గురువారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో బిసి బిల్లు పెట్టే వరకు బిసి ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తామన్నారు. జనాభా లెక్కల్లో బిసి కులాల వారి లెక్కలు సేకరించాలని డిమాండ్ చేశారు. బిసిలందరూ రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమాలు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ రంగంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర స్థాయిలో రూ.2 లక్షల కోట్ల బడ్జెట్‌తో బిసి సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దీక్షల్లో రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలా సీతారామన్ డిశ్చార్జి

న్యూఢిల్లీ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం డిశ్చార్జి అయ్యారు. వైరల్ ఫీవర్‌తో సోమవారం న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆమె.. తాజాగా డిశ్చార్జి అయ్యారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

దగ్గు మందు మరణాలపై ఉజ్బెకిస్థాన్‌తో సంప్రదిస్తున్నాం : కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ : ఉజ్బెకిస్థాన్‌లో భారత్‌లో తయారైన దగ్గు మందు వినియోగించి 18 మంది పిల్లలు మృతి చెందడంపై ఆ దేశంతో సంప్రదింపులు జరుపుతున్నామని, మరిన్ని దర్యాప్తు వివరాలివ్వాలని కోరామని కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి మాట్లాడుతూ భారత రాయబార కార్యాలయం ఉజ్బెకిస్థాన్‌ని సంప్రదించిందని, వారి దర్యాప్తునకు సంబంధించిన మరిన్ని వివరాలను కోరిందని తెలిపారు. అక్కడి కంపెనీ ప్రతినిధిసహా కొందరిపై ఉజ్బెకిస్థాన్ అధికారులు చట్టపరమైన చర్యలు ప్రారంభించారని తెలిపారు. మారియన్ బయోటెక్ కంపెనీ దగ్గుసిరప్ డాక్-1 మాక్స్‌ను భారతదేశంలో విక్రయించదని, ఉజ్బెకిస్తాన్‌కి మాత్రమే ఎగుమతి చేసిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. నోయిడా సెక్టార్ 67లోని మారియన్ కార్యాలయంపై సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) బృందం, యుపి డ్రగ్స్ నియంత్రణ బృందం దాడులు జరిపాయని చెప్పారు. దగ్గు సిరపల శాంపిల్స్‌ను సేకరించామని, పరీక్షల కోసం చండీగఢ్ ల్యాబ్‌కు పంపామని తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

ప్రధాన మంత్రి లైఫ్ సేవింగ్ పోలీస్ మెడల్ రద్దు

- కేంద్ర హోం శాఖ గెజిట్ నోటిఫికేషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి పోలీస్ మెడల్ ఫర్ లైఫ్ సేవింగ్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ) రద్దు చేసింది. ఈ మేరకు గురువారం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అంతకుముందు పోలీస్, పారా మిలటరీ దళాలకు రెండు సెట్ల పతకాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిలిపివేసింది.

కేరళలో పిఎఫ్ఐ నేతల ఇళ్లలో ఎన్ఐఎ సోదాలు..

కేరళ : పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ)పై మరోసారి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దాడులు నిర్వహిస్తోంది. గురువారం ఉదయం నాలుగు గంటల నుంచే కేరళ వ్యాప్తంగా పిఎఫ్ఐ నాయకులు, కార్యకర్తల ఇళ్లు, ఆఫీసుల్లో దాడులు నిర్వహిస్తోంది. మొత్తం 56 చోట్ల ఈ రైడ్స్ జరుగుతున్నాయి. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతుండటంతోపాటు అక్రమ నిధులు సేకరిస్తోందని పేర్కొంటూ ఇటీవల పిఎఫ్ఐను భారత ప్రభుత్వం నిషేధించింది.

113 సార్లు ప్రోటోకాల్ ఉల్లంఘించిన రాహుల్

- సిఆర్‌పిఎఫ్ ప్రకటన

న్యూఢిల్లీ : రాహుల్ గాంధీ 2020 నుండి 113 సార్లు సెక్యూరిటీ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని కేంద్రం గురువారం పేర్కొంది. భారత్ జోడో యాత్రలో భద్రతా ఉల్లంఘనలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించిన సంగతి తెలిసిందే. రాహుల్‌కి తగిన భద్రత కల్పించాలంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అమిత్‌షాకి బుధవారం లేఖ రాశారు. రాహుల్‌గాంధీ కోసం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి భద్రతా చర్యలు చేపట్టామని, కానీ.. స్వయంగా రాహుల్ ఢిల్లీసహా పలు ప్రాంతాల్లో ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని సిఆర్‌పిఎఫ్ పేర్కొంది. ఈ విషయాలను ఎప్పటికప్పుడు ఆయనకు తెలియజేశామని తెలిపింది.

పంజాబ్, హర్యానాలను వణికిస్తోన్న చలి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా చలి వణికిస్తోంది. కాశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో గురువారం మధ్యాహ్నం మంచు కురిసింది. పంజాబ్, ఛత్తీస్‌గఢ్‌లలో తేలికపాటి వర్షం కురిసినట్లు ఐఎండి వెల్లడించింది. వాయువ్య ప్రాంతాల్లో గురువారం 3-7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణశాఖ పేర్కొంది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, చండీగఢ్, ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో గురువారం 7-10 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్ర శనివారాల్లో పంజాబ్, హర్యానాల్లో దట్టమైన పొగమంచు, చలిగాలులు వీచే అవకాశముందని ఐఎండి వెల్లడించింది. శుక్రవారం రోజున కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మంచు కురిసే అవకాశముందని తెలిపింది.

శాంటాక్రజ్ గవర్నర్‌ను అరెస్ట్ చేసిన బొలీవియా పోలీసులు

లాపాజ్ : బొలీవియా ప్రధాన నగరమైన శాంటాక్రజ్ డిలా సియెర్రా గవర్నర్‌ను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నర్‌పై లాపాజ్‌లోని డిపార్ట్‌మెంటల్ ప్రాసిక్యూట్ కార్యాలయం జారీచేసిన అరెస్ట్ వారెంట్‌ను అమలు చేస్తున్నట్లు మంత్రి ఎడ్వర్డో డెల్ కాస్టిల్లో ప్రకటించారు.

40 రోజులు అత్యంత కీలకం

- జనవరిలో కరోనా ఉధృతి : అధికారుల అంచనా
- 31 నుంచి 2 శాతం విమాన ప్రయాణికులకు ర్యాండమ్ టెస్టులు

న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తి పూర్తిగా అదుపులోనే ఉన్నప్పటికీ రానున్న 40 రోజులు అత్యంత కీలకమైనవని ప్రభుత్వ అధికారులు తెలిపారు. జనవరిలో వైరస్ ఉధృతికి అవకాశం ఉండవచ్చని భావిస్తున్నారు. "గతంలో తూర్పు ఆసియాలో కొవిడ్ కొత్త వేవ్ మొదలైన 30-35 రోజుల తర్వాత భారత్‌లోనూ వైరస్ వ్యాప్తి మొదలవ్వడం గుర్తించాం. అదే ట్రెండ్ కొనసాగితే జనవరిలో దేశవ్యాప్తంగా కేసులు పెరగొచ్చు" అని కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలు శనివారం వెల్లడించాయి. 'ఒకవేళ కొత్త వేవ్ వచ్చినా.. కొవిడ్ మరణాలు, ఆసుపత్రుల్లో చేరికలు స్వల్పంగానే ఉంటాయి' అని సదరు వర్గాలు పేర్కొన్నాయి.

కాన్పూర్‌లోని లాలా లజపతిరాయ్ ఆసుపత్రిలో స్ట్రెచర్‌పై వైద్యపరికరాలను తీసుకెళ్తున్న దృశ్యం

39 మంది విదేశీ ప్రయాణికులకు పాజిటివ్

పలు దేశాల్లో కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణికులకు విమానాశ్రయాల్లో కరోనా పరీక్షలు ప్రారంభించిన విషయం తెలిసిందే. గత 2 రోజుల్లో ఆరు వేల మందికి పరీక్షలు చేయగా.. 39 మందికి పాజిటివ్ వచ్చిందని కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 31 నుంచి అంతర్జాతీయ విమానాల్లో వచ్చే రెండు శాతం మంది ప్రయాణియులకు ర్యాండమ్ టెస్టులను తప్పనిసరి చేస్తున్నట్లు పేర్కొన్నాయి.

చైనాలో ఒకటి కాదు.. నాలుగు వేరియంట్లు

చైనాలో కోవిడ్ వెల్లువకు ఒకటి కాదు నాలుగు వేరియంట్లు కారణమని భారత ప్రభుత్వ కొవిడ్ ప్యానల్ చీఫ్ ఎన్‌కే అరోడా తెలిపారు. చైనాలో బిఎఫ్.7 వేరియంట్ కేసులు 15శాతమేనన్నారు. బిఎన్, బిక్యూ వేరియంట్ల కేసులు 50 శాతం, ఎస్‌వివి వేరియంట్ నుంచి మరో 15 శాతం కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. భారత ప్రజల్లోని హైబ్రిడ్ ఇమ్యూనిటీ కారణంగా భయపడాల్సిన పనిలేదన్నారు.

కంబోడియా హోటల్ కేసినోలో భారీ అగ్ని ప్రమాదం

- 16మంది మృతి, 50మందికి పైగా గాయాలు

నాంఫెన్ : కంబోడియా హోటల్ కేసినోలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 16మంది మరణించారు. దాదాపు 50మంది గాయపడ్డారు. పెద్ద ఎత్తున చెలరేగిన అగ్ని కీలలు 12గంటలకు పైగా కొనసాగడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. థాయిలాండ్ సరిహద్దు పట్టణమైన పోయ్‌పెట్‌లో గ్రాండ్ డైమండ్ సిటీ కేసినో, హోటల్‌లో మంటలు చెలరేగడంతో లోపల చిక్కుకుపోయిన వ్యక్తులు పైనుండి పడిపోతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. లోపల వున్న వినియోగదారులు, సిబ్బంది ఇరువురిలోనూ థాయిలాండ్‌కు చెందినవారే ఎక్కువమంది వున్నారు. గురువారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో 13, 14, 15వ అంతస్తుల నుంచి సాయం కోసం కేకలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కిటికీల నుండి బయటకు చేతులు వూపుతూ, మొబైల్స్ ఫ్లాష్‌లైట్లను ఆన్‌చేసి చూపుతూ సాయం కోసం ఆర్తనాదాలు చేశారని చెపారు.

భ్రమల నుంచి జెలెన్‌స్కీ బయటపడాలి

- రష్యా విదేశాంగ మంత్రి

మాస్కో, కీవ్ : ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ప్రతిపాదించిన శాంతి ఫార్ములా ప్రాతిపదికన ఉక్రెయిన్‌తో రష్యా చర్చలు నిర్వహించదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ పేర్కొన్నారు. ఆ శాంతి ప్రతిపాదనలోని నియమ నిబంధనలు తమకు ఆమోదయోగ్యం కాదని తెలిపారు. అయితే ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు రష్యా వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. "అన్ని రకాల ఆలోచనలు, శాంతి సూత్రాలను ముందుకు తీసుకురావడం ద్వారా, పశ్చిమ దేశాల సాయంతో రష్యా భూభాగంలోని డాన్‌బాస్, క్రిమియా, జపోరొజియా, ఖెర్సాన్ ప్రాంతాల నుంచి మా బలగాలను ఉపసంహరించుకునేలా చేయగలనని జెలెన్‌స్కీ భ్రమ పడుతున్నారు. రష్యా నష్టపరిహారాలు చెల్లించేలా చూడగలమని, అంతర్జాతీయ ట్రిబ్యునళ్లకు తమను తాము అప్పగించుకోగలమని ఉక్రెయిన్ భ్రమ పడుతోంది. అని లావ్‌రోవ్ రష్యాకు చెందిన మీడియా సంస్థ రియా నొవొస్తితో వ్యాఖ్యానించారు. ఇటువంటి పరిస్థితుల్లో, షరతులతో రష్యా ఎవరితోనూ చర్చించబోదని స్పష్టం చేశారు. చర్చల ద్వారా ఈ ఘర్షణను పరిష్కరించుకోవడానికి మాస్కో వెనుకాడబోదని అన్నారు. 'ఉక్రెయిన్‌పై సైనిక చర్య ప్రారంభమైన వెంటనే జెలెన్‌స్కీ శాంతి చర్చలకు ప్రతిపాదించారు. దాన్ని మేం తిరస్కరించలేదు. వారి ప్రతినిధులతో సమావేశమయ్యాం' అని లావ్ రోవ్ చెప్పారు. రాజీ సూత్రాన్ని కనుగొనడం అసాధ్యంకాదని ఆ చర్చలు రుజువు చేశాయన్నారు.

120 రష్యా క్షిపణుల ప్రయోగం : ఉక్రెయిన్

ఉక్రెయిన్‌పై రష్యా గురువారం వరుసగా 120 క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో ముగ్గురు మరణించినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. పశ్చిమ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు వెల్లడించారు. గురువారం ఉదయం రాజధాని కీవ్ సహా ఖార్కీవ్, ఒడెశా, ఎల్వీవ్‌లపై వరుసగా 120 క్షిపణులను ప్రయోగించినట్లు అధ్యక్ష సలహాదారు మైఖైలో పొడోల్యాక్ తెలిపారు.

త్రిపుర బిజెపి ఎంఎల్ఎ రాజీనామా

- ఈ ఏడాదిలో ఏడుగురు

న్యూఢిల్లీ : త్రిపుర అసెంబ్లీలో బిజెపి ఎంఎల్ఎ దేవచంద్ర హ్రాంగ్‌ఖవాల్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ ఏడాదిలో పాలక సంకీర్ణం నుంచి వైదొలగిన ఏడవ ఎంఎల్ఎ ఆయన. ధలాయ్ జిల్లాలోని కరమ్‌చెర్రా ఎంఎల్ఎ అయిన హ్రాంగ్‌ఖవాల్ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు విలేకర్లకు తెలిపారు. వచ్చే ఏడాది ప్రారంభంలో త్రిపురలో ఎన్నికలు జరగనున్నాయి. త్రిపుర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడైన ఆయన 2018 అసెంబ్లీ ఎన్నికల ముందే బిజెపిలో చేరారు. తన తదుపరి కార్యాచరణ ఏమిటన్నది ఇంకా నిర్ణయించుకోలేదని అన్నారు. రాజకీయాల్లోనే కొనసాగుతానని చెప్పారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరతారా అని ప్రశ్నించగా, ఆ నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా తెలుస్తుందని ఆయన మీడియాతో వ్యాఖ్యానించారు. రాజీనామా చేయడానికి కాంగ్రెస్ నేతలతో కలిసి వచ్చిన ఆయన వారిని తన మంచి స్నేహితులుగా అభివర్ణించారు.

నకిలీ సర్టిఫికెట్లతో నమోదైన విదేశీ వైద్య పట్టభద్రులపై దేశవ్యాప్తంగా సిబిఐ సోదాలు

న్యూఢిల్లీ : నకిలీ అర్హతా సర్టిఫికెట్లను ఉపయోగించినందుకు 73 విదేశీ వైద్య పట్టభద్రులు, 14 రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్ల అధికారులు, పూర్వపు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) అధికారులపై, 90కి పైగా ప్రాంతాల్లో దేశవ్యాప్తంగా సిబిఐ దాడులు, తనిఖీలు నిర్వహించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 21న సిబిఐ కేసు నమోదు చేసింది. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్) నిర్వహించిన ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజిఇ)లో అర్హత సాధించకపోయినా, సాధించినట్లు నకిలీ సర్టిఫికెట్లు ఆధారంగా మెడికల్ కౌన్సిళ్లలోని మెడికల్ గ్రాడ్యుయేట్ల నమోదులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కేసు నమోదైంది.

సంక్షేమం ఉచితం కాదు...ప్రజల హక్కు

(మొదటి పేజీ తరువాయి)

సహేతుకం కాదని పేర్కొన్నారు. జాతి వ్యతిరేకశక్తులను అభ్యుదయ ప్రజాస్వామ్యవాదులు ఎదుర్కోవాలన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ సంఘ్‌పరివార్ శక్తులు దేశంలో స్వైరవిహారం చేస్తున్నాయని, మతపరమైన నిరంకుశత్వాన్ని నిస్సిగ్గుగా దేశంపై బిజెపి రుద్దుతోందని విమర్శించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా సంఘటితంగా కదంతొక్కాలని పిలుపునిచ్చారు. వ్యవసాయం, సహకారం, విద్యుత్తు, శాంతిభద్రతలకు సంబంధించిన వాటిపై రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్రం నిరంకుశంగా చట్టాలు చేస్తోందన్నారు. బిజెపియేతర రాష్ట్రాల్లో గవర్నర్లను రాజకీయ ఏజెంట్లుగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాలను బలహీనపర్చేందుకు కుట్ర చేస్తోందని తెలిపారు. మతోన్మాదం ముసుగులో నూతన ఆర్థిక విధానాలను ప్రజలపై రుద్దడంతో కార్పొరేట్లు మరింత ధనికులుగానూ, పేదలు మరింత పేదలుగానూ మారుతున్నారని అన్నారు. వామపక్షాల పోరాటాలతో వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. దేశంలో 42 శాతం యువత నిరుద్యోగులుగా ఉన్నారని, సేవా రంగంలో 80 లక్షలు ఉద్యోగాలకు కోతపడిందని అన్నారు. సరళీకృత ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని, రైతులు వ్యవసాయాన్ని వదిలేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా రోజూ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బడ్జెట్‌లో రైతుల వాటాను ఐదు శాతం నుంచి మూడు శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గిందన్నారు. పిఎం కిసాన్ స్కీంలో 67 శాతం మంది లబ్ధిదారులకు కోత విధించారని తెలిపారు. నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ పథకం పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారని, శాశ్వత ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారని అన్నారు. దేశంలో ప్రతిపక్ష పాత్రను కాంగ్రెస్ పోషించడం లేదని విజయన్ పేర్కొన్నారు. బిజెపి రిక్రూట్‌మెంట్ ఏజెన్సీగా ఆ పార్టీ పనిచేస్తోందని విమర్శించారు. సిపిఎం మాత్రమే నిజమైన ప్రతిపక్షమని, దేశ ప్రజల హక్కుల రక్షణకు ప్రజలందరూ సిపిఎంను బలపర్చాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షతన జరిగిన సభలో అఖిల భారత వ్యసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడారు. సభ ప్రారంభంలో ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవగీతాలు ఆకట్టుకున్నాయి. మహాసభ ప్రారంభం సందర్భంగా ఖమ్మం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

TATA

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదు కార్యాలయం చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గనపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400013
శాఖ చిరునామా: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డో.నం: 54-15-4బి/1, 5వ అంతస్తు, అరికె గల్లెరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీసు రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ భవనం, విజయవాడ-520008

స్థిరాస్తి యొక్క అమ్మకం కోసం నోటీసు

(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు రూల్ 9(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్)కి తనఖాగా ఉంచబడిన స్థిరాస్తిని క్రింద వివరించిన స్థిరాస్తిని గురించి సాధారణ ప్రజలుకు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత లేదా వారి చట్టపరమైన వారసులు/ప్రతినిధులు (రుణగ్రహీతలు)లకు దీని ద్వారా నోటీసు ఇవ్వడింది. టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క ఆధీకృత అధికారి తీసుకున్న స్వాధీనం 24.01.2023న దిగువ పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతలు బకాయిలను రికవరీ చేయడానికి "ఎక్కడ ఉందో అలాగే ఉంది" మరియు "ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది" ఆధారంగా. రిజర్వ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ దిగువన పేర్కొనబడ్డాయి. ఏదైనా వాయిదా/విక్రయాలు నిలిపివేయబడినప్పుడు, పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్/ఆస్తి దీని ద్వారా విక్రయించబడుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. ఇ -వేలం 24.01.2023న మ. 2గం.లకు. ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి యొక్క డిమాండ్ డ్రాఫ్ట్‌ను కలిగి ఉన్న సీల్డ్ ఎన్వలప్‌ను టిసిహెచ్‌ఎఫ్ఎల్ ఆధీకృత అధికారికి బ్రాంచ్ అడ్రసు: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్, డోర్ నెం. 54.15.4బి/1, 5వ అంతస్తు, ఆర్.కె. గల్లెరియా శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్డు, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008 వద్ద 21.01.2023, సా.5గం.ల లోపు సమర్పించాలి.
క్రింద వివరించిన క్లుప్త వివరాల ప్రకారం సురక్షి ఆస్తి/ స్థిరాస్తి విక్రయం "పరిస్థితి ఉన్న చోటనే" ఉంటుంది.

క్ర. సం	లోన్‌ఎకౌంట్ నెం. మరియు శాఖ	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు) చట్టపరమైన వారసులు/ న్యాయ ప్రతినిధి/ తనఖాదారు(లు) పేర్లు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వ్ మొత్తం	ఎర్నెస్ట్ మొత్తం
1.	10391127 & TCHIN0453 000100062 186	శ్రీమతి.దుంపల తులసి చలనకుమారి (రుణగ్రహీత), శ్రీ. దుంపల లక్ష్మణరావు (సహ రుణగ్రహీత)	Rs.23,75,442/- 12.01.2022	Rs. 15,00,000/- (పదిహేను లక్షల రూపాయలు మాత్రమే)	Rs. 1,50,000/- (ఒక లక్షా పదిహేను వేల రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి యొక్క వివరణ: షెడ్యూల్-ఎ: కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రార్, గుణదల ఎస్ఆర్ఓ, విజయవాడ రూరల్ మండలం, నిడమానూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామం ఆర్.ఎస్.నం.190/8, 193/1 సైట్ కొలిచే 435-55 చ.గజాలు. ఉన్న దీని హద్దులు: తూర్పు: బి. సాంబశివరావు యొక్క ఆస్తి, దక్షిణం: వి. కన్నయ్య యొక్క ఆస్తి, పడమర: రోడ్డు, ఉత్తరం: ఐ ప్రమీలా రాణి యొక్క ఆస్తి. ఈ సరిహద్దుల మధ్య పేర్కొనబడని వాటా యొక్క పరిధిలో 36-00 చ.గజాలు. లేదా 30-09 చ.మీటర్లు. మొత్తం నుండి కొలిచే పరిధి 435-55 చ.గజాలు లేదా 364.16 చ.మీటర్లు.
షెడ్యూల్ బి: పైన వివరించిన మొత్తం ఎ షెడ్యూల్ ఆస్తి "పుల్లమ్మ ఎన్‌క్లేవ్" పేరు మరియు శైలితో నిర్మించబడిన అపార్ట్‌మెంట్ యొక్క 2వ అంతస్తులోని ఆ ఫ్లాట్ నం.301లో మూల్యాంకనం నం.1812, డో.నం.7-107 ఉన్న హద్దులు: తూర్పు: ఫ్లాట్ నం.302, దక్షిణం: మెట్లకేస్ మరియు కామన్ కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: మెట్లకేస్ మరియు కామన్ కారిడార్. పై సరిహద్దుల మధ్య 2వ అంతస్తు, ఫ్లాట్ నం.301 కొలిచే 777 చ.అడుగులు. ప్లింత్ ఏరియా 50 చ.అడుగులు. కామన్ ఏరియా, పార్కింగ్, తో అన్నీ సౌకర్యాలు, ఫిక్చర్లు, ఫిట్టింగులు, తో కలిసి ఉమ్మడి హక్కులు, కామన్ సౌకర్యాలు అనగా మెట్లకేస్, లిఫ్ట్, డ్రైనేజి, నీరు, తో కలిసి దానికి సంబంధించిన అన్నీ సౌలభ్య హక్కులు.

వేలం వద్ద, సాధారణ ప్రజలు వ్యక్తిగతంగా వారి బిడ్(లు) దాఖలు చేయుటకు అహ్వానించడమైనది
రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) ఈ నోటీసు ప్రచురించిన 15 రోజులలోపు మొత్తం బకాయిలను తదుపరి వడ్డీతో చెల్లించడానికి ఇక్కడ చివరి అవకాశం ఇవ్వబడింది. లేని పక్షంలో స్థిరాస్తి షెడ్యూల్ ప్రకారం విక్రయించబడుతుంది. పైన పేర్కొన్న విధంగా చెల్లించాల్సిన మొత్తం, వడ్డీ మరియు ఖర్చులు (అమ్మకపు ఖర్చుతో సహా) పైన పేర్కొన్న మొత్తాన్ని 'ఆధీకృత అధికారికి టెండర్ చేస్తే ఇ వేలం నిలిపివేయబడుతుంది లేదా అటువంటి సురక్షితమైన రుణం, వడ్డీ మరియు ఖర్చులు చెల్లించినట్లు ఇ-వేలం తేదీకి ముందే అతని సంతృప్తికి రుజువు ఇచ్చినట్లయితే.
ఏ అధికారి లేదా ఇతర వ్యక్తి, ఈ అమ్మకానికి సంబంధించి ఏ విధమైన విధిని కలిగి ఉన్నా, అయితే, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వేలం వేయాలి, అమ్మిన ప్రవచనంలో ఆసక్తిని సంపాదించడానికి కొనుగోలుదారుడు ప్రయత్నిస్తాడు.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో సూచించిన షరతులకు లోబడి ఉండవలెను మరియు తదుపరి షరతులు అనుసరించవలెను: ఇ-వేలం 24.01.2023న మ.2.00గం.ల నుండి 3.00గం.ల మధ్యన ప్రతి 10 నిమిషాల పొడగింపుతో పోర్టల్ https://DisposalHub.com ద్వారా జరుగుతుంది.

నియమాలు మరియు నిబంధనలు:
1) దిగువ షెడ్యూల్‌లో ప్రత్యేకంగా పేర్కొన్నట్లుగా క్రింది సంతకందారునికి ఉన్నంత సమాచారం మేరకు సరైనవి, కాని క్రింది సంతకందారుడు ఈ ప్రొక్లేమేషన్‌లో ఏదేని పొరపాటు, మిస్‌స్టేట్‌మెంట్ లేదా లోపానికి సమాధానం ఇవ్వరు. మొత్తం బిడ్ లేదా బిడ్డరుదారుకు ఏదేని వివాదాలు తలెత్తితే, ఆ లాట్ మళ్లి ఒకసారి వేలం కొరకు ఉంచబడును.
2) ఆస్తిని రిజర్వు ధర కంటే తక్కువ ధరకు విక్రయించబడదు.
3) **బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- (పది వేల రూపాయాలు)**
4) ఆస్తి కొనుగోలు కోసం సమర్పించిన అన్ని బిడ్‌లు పైన పేర్కొన్న విధంగా ఎర్నెస్ట్ మనీతో పాటు "టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్" కి అనుకూలంగా ఉండే డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా అందించబడతాయి. చెల్లించవలసిన శాఖ చిరునామా: ఎన్ఆఎఫ్‌టి/ ఆర్‌టిజిఎస్/ ఐఎమ్‌పిఎస్ ద్వారా ఇఎమ్‌డి కోసం, దయచేసి ఆధీకృత అధికారిని సంప్రదించండి. వేలం సఫలీకృతంకాని బిడ్డరుదారులకు డిమాండ్ డ్రాఫ్టులు తిరిగిఇవ్వబడును.
5) అధికృతగల బిడ్డరుదారు బిడ్‌కు చట్టపరంగా అర్హతపొందినగా అన్నివిధాలా కల్పించిన ఏదేని లాట్ కొనుగోలుదారుగా ప్రకటించబడతారు మరియు తదుపరిగా అతని ద్వారా బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా ఉండరాదు. ఆఫర్‌చేసిన ధర సరిగాలేనట్లుగా స్పష్టంగా కనిపిస్తే అత్యధిక బిడ్ యొక్క క్షిణత అనుమతించుట ఆధీకృత అధికారి యొక్క విచక్షణ మేరకు ఉంటుంది.
6) రికార్డు అయిన కారణాల కొరకు అమ్మకంను వాయిదా వేయుట/నిలుపివేయుట అనునది 'అధీకృత అధికారి' యొక్క విచక్షణ మేరకు ఉంటుంది.
7) ఆస్తి యొక్క తనిఖీ **11.01.2023న ఉ.11 గం.ల నుండి సా.5.00గం.ల మధ్యలో** చేపట్టవచ్చును.
8) కొనుగోలుదారుగా ప్రకటించబడు వ్యక్తి, సదరు డిక్లేరేషన్ తరువాత వెంటనే, కొనుగోలుచేసిన మొత్తం/బిడ్‌లో ఇరవై ఐదు శాతంను 24 గం.లలోపు **'ఆధీకృత అధికారి'**కి డిపాజిట్ చేయవలెను మరియు సదరు డిపాజిట్ విషయంలో విఫలమైన యెడల, ఆస్తి వెంటనే ప్రైవేట్ ట్రీటి ద్వారా తాజా వేలం/అమ్మకానికి ఉంచబడుతుంది.
9) పై విధంగా చేసిన ప్రారంభ డిపాజిట్ విషయంలో, కొనుగోలు యొక్క మిగిలిన మొత్తంను అస్తి అమ్మకం నిర్ధారణ తేది నుండి 15వ రోజున లేదా ఆలోగా అధీకృత అధికారి కొనుగోలుదారు చెల్లించవలెను, లేదా ఒకవేళ 15వ రోజు ఆదివారం లేదా ఇతర సెలవు రోజువస్తే, 15వ రోజు తరువాత మొదటి రోజున చెల్లించవలెను.
10) పైన పేర్కొన్న సమయంలో ఏదైన విఫలం చెందితే, ప్రైవేట్ ట్రీటి ద్వారా ఆస్థిని తాజాగా వేలం/విక్రయం జరుపబడును. డిపాజిట్ టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా ఇఎండి సహా వదులుకోవాల్సి ఉంటుంది మరియు విఫలమైన కొనుగోలుదారుడు ఆస్థి దావాలు కోల్పోవలసి ఉంటుంది.
11) ఆస్తికి సంబంధించిన **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి తెలిసినంత వరకు ఏదేని రుణాభారాలు వివరాలు: నిల్. ఆస్తికి పెట్టబడిన క్లెయింలు ఏవేని ఉన్నట్లయితే మరియు దీని స్వభావం మరియు విలువపై కలిగియున్న ఏదేని ఇతర తెలిసిన వివరాలు : లేవు. పైవి కాక ఇతరములు ఏవీలేవు.
12) **ఏదైనా ఇతర వివరాల కోసం లేదా ఇ-వేలం పై ఆన్ లైన్ శిక్షణ కోసం కాబోయే బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్ నెక్సెన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, చిరునామా: #203, 2వ అంతస్తు, శ్రీ శ్యాం పాలెస్, సెక్టార్: 4 మరియు 5 క్రాసింగ్, రైల్వే రోడ్డు, గురుగ్రాం-122 006 ద్వారా మొబైల్ నం: +91 9710029933, +91 9810029926, టెలిఫోన్ నం. +91 124 4 233 933, ఇ మెయిల్ ఐడి: CSD@disposalhub.com లేదా మనిష్ బన్సాల్, ఇ మెయిల్ ఐడి: Manish.bansal@tatacapital.com ని సంప్రదించవచ్చు.** ఆధీకృత అధికారి ఫోన్ నెం. 8588983696, దయచేసి మీ ప్రశ్నను వాట్సప్ నెం. 9999078669 లో పంపండి.
13) 1% టిడిఎస్ వర్తింబడును మరియు గరిష్టంగా ప్రకటించిన బిడ్ మొత్తం మీద అత్యధిక బిడ్డర్ ద్వారా చెల్లించబడుతుంది. యజమాని/ రుణగ్రహీత(లు) యొక్క పాన్‌లో అత్యధిక బిడ్డర్ ద్వారా పేమెంట్ చెల్లించాల్సిన అవసరం ఉంటుంది మరియు ఒక చలాన్ కాపీ మా కంపెనీకి దాఖలు చేయాల్సి ఉంటుంది.
14) **పై వివరాలకు సెక్యూర్డ్ క్రెడిటార్'స్ వెబ్‌సైట్ https://bit.ly/3vmbblw లో పొందుపరిచిన క్రింది లింక్‌ను చూడవచ్చు.**
15. దయచేసి https://www.tatacapital.com/property-disposal.html లింక్‌ని కూడా సందర్శించండి. దయచేసి గమనించండి టిసిహెచ్‌ఎఫ్ఎల్ ఈ ఆస్తి అమ్మకం/ వేలం కోసం పేర్కొన్న వేలం భాగస్వామితో పాటు ఏ బ్రోకర్/ఏజెంట్‌ను నిమగ్నం చేయలేదు. ఆసక్తి ఉన్న పార్టీలు ఈ విషయంలో అన్ని సందేహాలు మరియు విచారణల కోసం దిగువ సంతకం చేసిన ఆధీకృత అధికారిని మాత్రమే సంప్రదించాలి.

తేది: 30.12.2022,
ప్రదేశం: విజయవాడ.

సం/- ఆధీకృత అధికారి,
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

చిన్నారి

అవమానం

గంగాపురంలో రవి, సురేష్ అనే ఇద్దరు స్నేహితులున్నారు. క్లాసులో పక్కపక్కనే కూర్చుని పాఠాలు వినేవారు. రవి మంచిగా చదివి, పట్నంలో ఉన్న ఒక కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. సురేష్ కుటుంబ పరిస్థితుల వల్ల చదువు మధ్యలో మానేసి ఊరిలో పని చేయసాగాడు.

ఒక రోజు సురేష్ పని మీద పట్నం వెళ్ళాడు. దారిలో రవి కారులో వెళ్ళడం చూశాడు. పాత స్నేహితుడు కనిపించాడన్న సంతోషంతో సురేష్ పిలిచాడు. కాని రవి కారు ఆపలేదు. సురేష్, రవి కారును వెంబడిస్తూ ఆఫీస్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడి పెద్ద బిల్డింగ్‌ను చూసి ఆశ్చర్యపోయాడు. రవిని వెతుక్కుంటూ ఆఫీసులోనికి వెళ్లాడు.

రవి, సురేష్‌ను చూసి గుర్తుపట్టనట్లు ముఖం పెట్టాడు.

'ఎవరు నువ్వు. లోపలికి వస్తున్నావు' అన్నాడు.

'రవి...నేను నీ చిన్ననాటి స్నేహితున్ని... సురేష్‌ను.' అన్నాడు.

'నువ్వు ఒకప్పుడు నా స్నేహితుడివి కావచ్చు. ఇప్పుడు నేను ఈ కంపెనీకి మేనేజర్‌ని. బయటకు వెళు అన్నాడు రవి.

సురేష్ చాలా బాధపడ్డాడు. పట్నంలో పని చూసుకుని దిగులుగా ఊరికి వచ్చాడు. రవి చేసిన అవమానం పదేపదే తలచుకుని కుమిలిపోయాడు. కొన్ని నెలల తర్వాత సురేష్ గేదెలు కొని, పాల వ్యాపారం ప్రారంభించాడు. రెండు సంవత్సరాలలో సురేష్ వ్యాపారం లాభాలతో సాగుతుంది. కొన్ని సంవత్సరాలకు రవి పనిచేసున్న కంపెనీ షేర్స్ పడిపోయి దివాళా తీసింది. రవి ఉద్యోగం పోయింది. అప్పులపాలయ్యాడు. ఏమి చేయాలో తెలియక ఊరికి వెళ్ళాడు. సురేష్ దగ్గర బాగా డబ్బు ఉందని రవికి తెలిసింది. ఏదైనా సహాయం అడుగుదామని సురేష్ ఇంటికి వెళ్లాడు. క్షమించమని అడిగాడు.

సురేష్, రవి చేసిన అవమానం గుర్తుపెట్టుకోకుండా, రవిని లోనికి ఆహ్వానించాడు. మర్యాదలు చేసి, ఏదైనా వ్యాపారం పెట్టుకోమని చెప్పి, కొంత డబ్బు ఇచ్చాడు. సురేష్ మంచి మనసుకు కృతజ్ఞతలు చెప్పాడు రవి. ఇక నుంచి ఎవరినీ అవమానించకూడదని తెలుసుకున్నాడు.

- బెజగామ సాత్విక
6వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా,
99590 07914.

నేను గీసిన బొమ్మ

- జి. చిన్న,
8వ తరగతి,
ఇంగ్లీష్ మీడియం,
జెడ్ పి హెచ్ ఎస్,
హవేలీ, ఘనాపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన the family

JEEVANA

మహిళలపై మాటల ఈటెలు

ట్రెండ్ 2022

ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తుందని గురజాడ చెప్పినా.. అర్ధరాత్రి ఓ మహిళ ఒంటరిగా నడిచినప్పుడే నిజమైన స్వాతంత్ర్యమని గాంధీ పలికినా.. ఇంటికి దీపం ఇల్లాలన్నా.. సమాజ ప్రగతిలో మహిళ పాత్ర ఎంతో కీలకమన్న సారాంశం ప్రస్ఫుటిస్తుంది. కానీ మిలీనియం దాటి రెండు దశాబ్దాలు గడిచినా ఆమె ఉనికి ప్రశ్నార్థకమౌతోంది. మానవ హక్కుల ఉల్లంఘనలో మహిళలపై జరుగుతున్న హింస ముందువరుసలో ఉందని ఐక్యరాజ్యసమితి పేర్కొనడం పరిస్థితి తీవ్రతను ప్రతిబింబిస్తోంది.

గొప్ప

గొప్ప ఆవిష్కరణలకు 20వ శతాబ్దం దిక్సూచిగా నిలబడింది. శాస్త్ర, సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ఆ కాలంలోనే 21వ శతాబ్దం గురించి ఎన్నో కలలుగన్నాం. ఆధునిక సమాజంలో స్త్రీ, పురుష వివక్ష మాయమవుతుందని, అన్ని రంగాలలో మహిళలు రాణిస్తారని ఆశించాం. విద్య, ఉపాధిలో వివక్షలేని సమాజం వస్తుందని భావించాం. కానీ సమాజంలో మహిళల పరిస్థితి రానురాను అధ:పాతాళానికి పడిపోతోంది.

ఆకాశంలో ప్రయాణిస్తున్నా, రాకెట్లు తయారుచేస్తున్నా.. ఎంత ఉన్నత స్థానాలకు ఎగబాకినా మహిళలపై వేధింపులు తప్పడం లేదు. చట్టసభల సాక్షిగా, న్యాయస్థానాల తీర్పుల్లో.. పాలకుల వ్యాఖ్యల్లో నిత్యం ఆమెకు నిరాదరణే ఎదురౌతోంది. మహిళలపై దాడులు, హింసలు, అత్యాచారాలు, హత్యలు, అనుచిత వ్యాఖ్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయే కాని తగ్గడం లేదు. ఇంట్లో వేధింపులు, వరకట్న చావులు, కిడ్నాప్‌లు, అత్యాచారాలు, హత్యలు, పెళ్లికి నిరాకరించిందని కత్తితో తెగగోయడాలు, యాసిడ్ పోయడాలు, భ్రూణ హత్యలు, కులదురహంకార హత్యలు.. ఒకటా రెండా ప్రతి చోటా వేధింపులే.

ఒక ధనవంతుడి ఇంట్లో దొంగతనం జరిగితే దొంగలను పట్టుకుని శిక్షిస్తారు. ఈ ఘటనలో ఆ దొంగలను ప్రేరేపించేలా ధనికుడు డబ్బు సంపాదించాడని, ఆభరణాలు ధరించాడని అదే నేరానికి కారణమని ఎవరూ అనరు. కాని ఒక మహిళపై దాడి, వేధించడం, అత్యాచారం, హత్య జరిగితే అందుకు కారకురాలు ఆమేనంటూ ఎన్నో నోళ్లు తెరుచుకుంటాయి. ఆమె వేసుకున్న దుస్తులు, నడవడికే కారణమై ఉంటుందని రకరకాల ఉదాహరణలతో ఉపమానాలు చెప్పేస్తుంటారు. నిందితులకు కొమ్ముకాసి బాధితురాలిని, ఆమె కుటుంబాన్ని మానసికంగా, శారీరకంగా హింసిస్తారు.

మొన్నటికి మొన్న దేశరాజధాని ఢిల్లీలో శ్రద్ధా వాకర్ హత్య కేసులో ఆమెను ముక్కలు ముక్కలుగా నరికిన భాగస్వామి అఫ్తాబ్ బెయిల్ కోరుతూ కోర్టును ఆశ్రయించాడు. ఈ సంఘటనను బట్టి మహిళలపై ఎంతటి క్రూర నేరం చేసినా తప్పించుకునేందుకు ఏదో ఒక దారి దొరుకుతుందని నిందితులు భావిస్తున్నారని అనుకోవచ్చు. అందుకు సాక్ష్యంగా ఎన్నో ఉదాహరణలు మన కళ్ల ముందున్నాయి. అత్యాచారాలకు బలైన ఎంతోమంది ఆడపిల్లలు, వారి కుటుంబాలకు ఏళ్లు గడుస్తున్నా న్యాయం జరగడం లేదు. గుజరాత్ గోద్రా అల్లర్ల బాధితురాలు బిల్కిస్ బానో విషయంలో నిందితులను రక్షించేందుకు పాలకులు ఎన్ని అడ్డదారులు తొక్కారో చూస్తే ఈ విషయం స్పష్టమౌతుంది. న్యాయస్థానం కూడా ఆమె మొర వినిపించుకోలేదు. మరో కేసులో తనపై అసభ్యంగా ప్రవర్తించాడని కోర్టుకెళ్లిన ఓ మహిళను అవమానిస్తూ న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కేసు విచారణలో భాగంగా ఆమె ధరించిన దుస్తులే అతన్ని ఆవిధంగా ప్రేరేపించాయని తీర్పుచెప్పి నిందితునికి బెయిల్ మంజూరుచేసింది. ఇంకోచోట బాలికపై అత్యాచారం జరిగిందని న్యాయం చేయమని అర్థించినప్పుడు కూడా బాలిక అంతర్గత అవయవాలను ఆమె ధరించిన వస్త్రాలపై నుండి తాకితే నేరం కాదు.. కాబట్టి ఈ కేసులో నిందితుడిపై ఆరోపించబడిన ఆరోపణలు సరైనవి కావని సాక్షాత్తూ ఓ మహిళా న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఉచితంగా వస్తే మహిళలు ఏదైనా తీసుకుంటారన్న అర్థంలో కాస్తంత దూరం నడవడానికి కూడా మహిళలు ఉచిత బస్ సర్వీసులు ఉపయోగించుకుంటున్నారని తమిళనాడు మంత్రి ఒకరు ఇటీవల వ్యాఖ్యానించారు. అంతకుముందే ప్రభుత్వం ఉచితంగా శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేయాలన్న విద్యార్థినుల మాటలను హేళనచేస్తూ మీకు ఉచితంగా ఇస్తే కండోమ్స్ కూడా అడిగేట్లు ఉన్నారే అంటూ ఐఎఎస్ అధికారి అవమానకరంగా మాట్లాడారు.

భర్త వేధిస్తున్నాడని, ప్రేమించకపోతే చంపేస్తానని ఓ వ్యక్తి బెదిరిస్తున్నాడని, అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని మొరపెట్టుకుంటూ భద్రత కోసం పోలీసుస్టేషను గుమ్మం ఎక్కిన ప్రతిసారీ తననే నేరస్తురాలిగా చూస్తూ ఆమె ప్రవర్తన మార్చుకొమ్మని, అతని నుండి తప్పించుకు తిరగమని సలహాలిచ్చేవారు ఎక్కువగా ఉంటారు. తల్లిదండ్రులు, స్నేహితులే కాదు చట్టాన్ని రక్షించే వారు కూడా ఇలాంటి సూచనలు ఇస్తుంటే వారి బాధ ఎవరికి చెప్పుకుంటారు? రక్షించేవారు లేక ఎక్కడ, ఎప్పుడు దాడి జరుగుతుందో తెలియక క్షణక్షణం భయంభయంగా జీవితాలు వెల్లదీస్తున్న మహిళలెందరో మన చుట్టూ ఉన్నారు.

పిల్లలను కనేందుకే మహిళలు పుట్టారు. అది ఆమెకు ఉన్న గొప్ప వరం. వంశాన్ని వృద్ధి చేసే భార్య భర్త కనుసన్నల్లో మెలగాలి. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకుల అదుపాజ్ఞల్లో బతకాలి. మగవారిని ఎదిరించకూడదు. కుటుంబ గౌరవాన్ని కాపాడేందుకు ఎన్నో త్యాగాలు చేయాలి. భర్తకు తప్ప ఆమె ఎవరికీ అందంగా కనిపించకూడదు.. అంటూ రకరకాల చెత్త వాగుడును గొప్ప గొప్ప ప్రసంగాలుగా ఇచ్చే ప్రవచనకారులు, బాబాలు మనకు ఎంతోమంది ఉన్నారు. మహిళలను శక్తిమంతులుగా కీర్తిస్తూనే ఆమె ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు అంటూ ఆమె చుట్టూ ఆంక్షల వలయం పెట్టేవారు ఎక్కడ చూసినా కనిపిస్తారు.

ఎంతోమంది మహిళలు ఎన్నో అద్భుతాలను సృష్టించారు.. సృష్టిస్తారు.. కాని ఇంకా మనం మహిళల భద్రత, రక్షణ గురించి మాట్లాడు కుంటున్నాం. ఆమె మనుగడ గురించి చర్చించు కుంటున్నాం. ఎన్నో శతాబ్దాల క్రితం నుంచే ఎన్నో అడ్డంకులను దాటుకుని మహిళలు రాణిస్తున్నారు. 20వ శతాబ్దంలో గొప్ప ప్రేరణనిచ్చే స్ఫూర్తినింపే ఆమె విజయగాథలు ఎన్నో చూశాం. 21వ శతాబ్దం ఆమెను మరిన్ని ఉన్నత శిఖరాల్లో నిలబెడుతుంద నుకున్నాం. కానీ..

ఛాందసవాదుల పాలనలో, ప్రాబల్యంలో ఆమె పరిస్థితి రానురాను దిగజారిపోతోంది. సంస్కృతి, సాంప్రదాయం పేరుతో మహిళల వస్త్రధారణ, నడవడికపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. బాధితురాలినే దోషిగా నిలబెడుతున్నారు.

మహిళలను కించపరుస్తూ, చులకన చేస్తూ, అవమానించే వారంతా కుల, మత, జాతి వివక్ష కంటే లింగ వివక్ష వల్ల జరిగే అనర్థాలను తెలుసుకోవాలి. కులం నశించినా.. మతం అంతరించినా.. జాతులు మారినా సమాజ పరిణామక్రమంలో అదో భాగం. కానీ వివక్షతో స్త్రీలను అణిచివేయాలని చూస్తే సమాజం ముందుకుపోదు. ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందాన తయారవుతుంది. సమాజంలో స్త్రీలను, ఆమె పాత్రను గుర్తించని సనాతన వాదుల వాదనలను తోసిపుచ్చేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధమవ్వాలి. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సాధికారతతో పాటు స్త్రీ, పురుషులకు సమాన హక్కులు లభించాలి. ఆ దిశగా నూతన శకం అడుగులు వేయాలి. మనం ఆధునిక కాలంలో ఉన్నాం.. గతమంతా గొప్పదన్న రోత వరవడిని వదులుకోవాలి.

రంగవల్లి

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

పి శ్రీలేఖ,
చామర్తివారి వీధి,
దుర్గాపురం,
విజయవాడ.
15 చుక్కలు
8 వచ్చేవరకు (మధ్య చుక్క)

కళాకారుల సంక్షేమంలో ముందుంటా : చిరంజీవి

సినిమా ఇండస్ట్రీలో కళాకారుల సంక్షేమం కోసం తానెప్పుడూ ముందుంటానన్నారు చిరంజీవి. సినీ కార్మికుల కోసం చిత్రపురి కాలనీలో నిర్మించిన నూతన గృహ సముదాయాన్ని గురువారం ఆయన ప్రారంచారు. లబ్ధిదారులకు పట్టాలు అందించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'సరిగ్గా 22 ఏళ్ల క్రితం ఇదే రోజున చిత్రపురి కాలనీకి శంకుస్థాపన జరిగింది. అందుకే ఇదే రోజున ఈ గృహసముదాయాన్ని ప్రారంభించాలనుకున్నాం' అని ఛైర్మన్ అనిల్ దొర్రై చెప్పారు. అందుకే ఈ కార్యంలో భాగం కావాలనుకున్నా. బిజీ షెడ్యూల్లో కూడా కార్యక్రమాలు వాయిదా వేసుకుని వచ్చా. ఈ సందర్భంగా మనం డాక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డిని గుర్తు చేసుకుని ఆయనకు నివాళులు అర్పించాలి. ఆయన సుదీర్ఘ ఆలోచన నేడు సాకారమైంది. అనిల్ దొర్రై సారథ్యంలో కొత్త కమిటీ అన్ని పనులను సజావుగా పూర్తి చేసిందని సి. కల్యాణ్, తమ్మారెడ్డి తెలిపారు. 'డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులందరికీ శుభాకాంక్షలు. మీకెప్పుడూ ఏ అవసరం వచ్చినా నేను ముందుంటాను. సి. కల్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ నన్ను ప్రతిసారీ పెద్ద అని చెబుతుంటారు. పెద్దరికం అనుభవించాలనే ఆలోచన నాకు లేదు. ఎలాంటి కుర్చీలూ వద్దు. ఎవరికైనా అవసరం వచ్చినప్పుడు తప్పకుండా భుజం కాస్తా' అని చిరంజీవి వివరించారు.

'కళ్యాణం కమనీయం' మరో పాట

సంతోష్ శోభన్ నటిస్తున్న తాజా చిత్రం 'కళ్యాణం కమనీయం'. యువి కాన్సెప్ట్స్ బ్యానర్‌పై పెళ్లి నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీ ద్వారా ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా నుండి 'హో ఎగిరే' పల్లవితో సాగే లిరికల్ సాంగ్‌ని విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యాన్ని అందించారు. శ్రావణ్ భరద్వాజ్ కంపోజ్ చేయగా కపిల్ కపిలన్ పాడారు. సినిమాకి సంబంధించిన లిరికల్ సాంగ్స్ ఒక్కొక్కటిగా రిలీజ్ చేస్తూ వస్తున్నారు. ఈ సినిమా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఫిబ్రవరి 3న 'రైటర్ పద్మభూషణ్'

సుహాస్ నటిస్తున్న కొత్త చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ తెరకెక్కించిన ఈ చిత్రం నుండి తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు సినిమా రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు. ఫిబ్రవరి 3న ఈ చిత్రం థియేటర్స్‌లో విడుదల కానుంది. శేఖర్ చంద్ర, కళ్యాణ్ నాయక్ ఈ సినిమాకి సంగీతం అందించారు. టీనా శిల్పారాజ్ హీరోయిన్‌గా నటించారు. చాయ్ బిస్కెట్ వారితో లహరి ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మాణం వహిస్తోంది.

'జీ2' తాజా సమాచారం

అడివిశేష్ నటించిన 'గూఢచారి' సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న సినిమాపై తాజా సమాచారం వచ్చేసింది. ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్‌తో ఈ చిత్రాన్ని "జీ2" గా ప్రెజెంట్ చేస్తూ ఓ పోస్టరు విడుదల చేశారు. అలాగే 'ప్రీ విజన్' వీడియోను జనవరి 9న ఢిల్లీ ముంబైలలో లాంచ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని విజయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తుండగా కథను శేష్ అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

మరో సాంగ్ రిలీజ్‌కు సిద్ధం

మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి ఇప్పటి వరకు మూడు పాటలు విడుదల చేశారు. నాలుగో సాంగ్ ఇద్దరి హీరోల కాంబోలో రూపొందింది. దాన్ని ఈ నెల 30న, శుక్రవారం విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిరంజీవి, రవితేజ ఉన్న కొత్త పోస్టర్‌ను ట్విట్టర్లో పోస్టు చేసింది. దీంతో అభిమానులు సంబరపడిపోతున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో వరుసగా అప్‌డేట్స్ ఇస్తుంది చిత్రబృందం.

నటుడు వల్లభనేని జనార్ధన్ మృతి

టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. సీనియర్ నటుడు వల్లభనేని జనార్ధన్ (63) తుదిశ్వాస విడిచారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం కన్నుమూశారు. విజయవాడకు చెందిన జనార్ధన్‌కు చిన్నప్పటి నుంచీ నాటకాలపై ఆసక్తి ఎక్కువ. కాలేజీ రోజుల్లోనే పలు నాటకాల్లో కీలక పాత్రలు పోషించారు. కళాశాల చదువు పూర్తైన వెంటనే 'కళామాధురి' అనే నాటక సంస్థను స్థాపించి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఇండస్ట్రీలోకి వచ్చారు. దర్శకుడు, రాఘవేంద్ర రావు తెరకెక్కించిన 'గజదొంగ' సినిమాలో మొదట నటించారు. ఆ తర్వాత చాలా సినిమాల్లో నటించారు. ఆ సమయంలో దర్శకుడు విజయ బాపినీడు కుమార్తెను ఆయన వివాహమాడారు. అనంతరం ఆయన తీసిన సినిమా 'గ్యాంగ్‌లీడర్'లో జనార్ధన్ పోలీస్ అధికారిగా నటించి మంచి గుర్తింపు సంపాదించారు. ఈ సినిమా తర్వాత తెలుగులో ఆయనకు వరుస అవకాశాలు వచ్చాయి. సినిమాల్లోనే కాకుండా పలు సీరియళ్లలోనూ నటించారు. నిర్మాత, దర్శకుడిగా పలు చిత్రాలను తీసిన ఆయన మరణం పట్ల టాలీవుడ్ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

డబ్ల్యుటిసి ఫైనల్ దిశగా టీమిండియా

ఆస్ట్రేలియా చేతిలో ఇన్నింగ్స్ తేడాతో దక్షిణాఫ్రికా ఓటమి

(ప్రజాశక్తి స్పోర్ట్స్ డెస్క్)

ఆస్ట్రేలియా చేతిలో రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఇన్నింగ్స్ 182పరుగుల తేడాతో ఓటమితో టీమిండియా డబ్ల్యుటిసి ఫైనల్స్ అవకాశాలకు దారి సుగమమైంది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన రెండో టెస్టులో సఫారీలపై ఆసీస్ ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించడంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) పాయింట్ల పట్టికలో ఆసీస్ తన మొదటి స్థానాన్ని సుస్థిరం చేసుకొంది. ఇక రెండో స్థానంలో ఉన్న టీమిండియాకి ఫైనల్స్ అవకాశాలు కాస్త మెరుగయ్యాయి. ఇన్నింగ్స్ తేడాతో ఓటమితో దక్షిణాఫ్రికా జట్టు నాలుగో స్థానానికి పడిపోయింది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా 14టెస్టుల్లో 10విజయాలు, ఒక ఓటమి, మూడు డ్రాలతో 132 పాయింట్లు సాధించి 78.57 శాతంతో అగ్రస్థానంలో ఉంది. దక్షిణాఫ్రికాతో చివరి టెస్టులోనూ ఆసీస్ విజయం సాధిస్తే డబ్ల్యుటీసీ ఫైనల్‌కు చేరుకొన్నట్లే. ఆసీస్ తర్వాత భారత్ 58.93 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు గెలిస్తే భారత్ కూడా తన గెలుపు శాతాన్ని పెంచుకొని ఫైనల్ బెర్తును ఖాయం చేసుకోనుంది. తాజా డబ్ల్యుటిసి ర్యాంకింగ్స్ ప్రకారం శ్రీలంక(53.33 శాతం) మూడో స్థానానికి చేరుకోగా.. దక్షిణాఫ్రికా 50 శాతంతో నాలుగోస్థానానికి పడిపోయింది. ఇక ఇంగ్లండ్(46.97 శాతం) ఐదో స్థానం, వెస్టిండీస్(40.91 శాతం) ఆరో స్థానంలో నిలిచాయి. పాకిస్తాన్(38.89 శాతం) ఏడో స్థానంలో, న్యూజిలాండ్ (25.11 శాతం), బంగ్లాదేశ్ (11.11 శాతం) ఎనిమిది, తొమ్మిదో స్థానాల్లో కొనసాగుతున్నాయి.

విలియమ్సన్ డబుల్ సెంచరీ

డ్రా దిశగా పాక్-కివీస్ టెస్ట్

కరాచీ: పాకిస్తాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలిటెస్ట్ డ్రా దిశగా పయనిస్తోంది. నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి పాక్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 2వికెట్లు నష్టపోయి 77పరుగులు చేసింది. అంతకుముందు న్యూజిలాండ్ జట్టు 9 వికెట్ల నష్టానికి 619పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. విలియమ్సన్(200) డబుల్ సెంచరీకి తోడు ఇష్ సోఢీ(65) బ్యాటింగ్‌లో రాణించారు.

ఆసీస్ ఘన విజయం

మెల్‌బోర్న్: రెండోటెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు ఇన్నింగ్స్ 182పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 15పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీ జట్టు 204పరుగులకు ఆలౌటైంది. బవుమా(65) అర్ధసెంచరీతో రాణించాడు. లియోన్‌కు మూడు, బోలండ్‌కు రెండు, స్టార్క్, కమ్మిన్స్, స్మిత్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 575పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 189పరుగులు చేసింది. మూడో, చివరి టెస్ట్ జనవరి 4నుంచి జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డేవిడ్ వార్నర్‌కు లభించింది.

ఆంధ్ర లక్ష్యం 240పరుగులు

మహారాష్ట్ర రెండో ఇన్నింగ్స్ 250ఆలౌట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని చింతలవలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్ రసవత్తరంగా సాగు తోంది. రెండో ఇన్నింగ్స్‌లో మహారాష్ట్ర జట్టు 250 పరుగులకు ఆలౌట్ అయింది. ఆంధ్ర బౌలర్లలో నితీష్ కుమార్ 3, శశికాంత్ 2, రాయుడు 2, కార్తిక్ రామన్ 2 వికెట్లు పడగొట్టారు. దీంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత 11పరుగులు పోను 240 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఛేదనలో ఆంధ్రా జట్టు మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి వంద పరుగులు చేసింది. చివరి రోజు విజయానికి 140 పరుగులు చేయాల్సి ఉండగా, చేతిలో 6 వికెట్లు ఉన్నాయి. కెప్టెన్ హనుమ విహారి 36 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. మహారాష్ట్ర బౌలర్లలో పాల్కర్ 2 వికెట్లు, ఇంగలే ఒక వికెట్ తీశారు.

ఊరిస్తోన్న విజయం

ఎలైట్ గ్రూప్-బిలో అస్సాం-హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్ ఇరుజట్లను విజయం ఊరిస్తోంది. 251పరుగుల ఛేదనలో భాగంగా హైదరాబాద్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 9వికెట్లు కోల్పోయి 228పరుగులు చేసింది. అస్సాం గెలుపుకు మరో వికెట్ చేజిక్కించుకోవాల్సి ఉండగా.. హైదరాబాద్ విజయానికి మరో 23పరుగులు చేయాల్సి ఉంది.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు

ముగ్గురు విజయనగరం క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు విజయనగరం జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 25, 26, 27 తేదీల్లో జరిగిన ఆరో రాష్ట్ర స్థాయి సీనియర్ బాక్సింగ్‌లో ఎన్.అజయ్ వర్మ 66-70 కిలోల విభాగంలో, బి.మనీష్ 86-92 కిలోల విభాగంలో, సిహెచ్.సురేంద్ర 92 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులు ఈ నెల 31 నుంచి జనవరి 6వ తేదీ వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మన రాష్ట్రం తరపున బరిలో దిగనున్నారు. వారిని ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డోల మన్మథకుమార్, సభ్యులు ఎస్.రాజు, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, సీనియర్ బాక్సింగ్ ప్లేయర్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు అభినందించారు. హర్యానాలో జరిగే పోటీలకు విజయనగరం జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు గురువారం బయల్దేరారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68